
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 28 జూన్ 2025



సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో ఎన్టీఆర్ కాలనీ ఇళ్ల నిర్మాణానికి తీసుకువచ్చిన ఇనుమును పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే పంచకర్ల

జయహో జగన్నాథ

- జయజయధ్వానాల మధ్య సందడిగా రథయాత్ర
- భక్తులతో కిక్కిరిసిన పూర్ణామార్కెట్
- ఇస్కాన్, ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు

భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథుడి రథ చక్రాలు కదిలాయి. టౌన్ కొత్తరోడ్డులోని పురాతన ఆలయం నుంచి ఉదయం 9 గంటలకే బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి విగ్రహాలను ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించారు. సాయంత్రం వరకు పూజలు చేసిన అనంతరం 4 గంటలకు రథయాత్ర ప్రారంభమయింది. టర్నర్‌చౌల్ట్రీలోని గుండిచా మందిరానికి చేరుకున్న స్వామి పది రోజుల పాటు అక్కడే భక్తులకు దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు. రథయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన భక్త జనంతో పూర్ణామార్కెట్ ప్రాంతం కిక్కిరిసింది. రథాన్ని లాగేందుకు పలువురు పోటీ పడ్డారు. కాగా సిరిపురం ఆలిండియా రేడియో వద్ద నున్న ఉత్కళ్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో జగన్నాథ రథ యాత్ర కన్నుల పండువగా సాగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్‌లో సాగిన రథయాత్రలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా రథయాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.



టౌన్ కొత్తరోడ్డు నుంచి ప్రారంభమైన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తజనం. (ఇన్‌సెట్)లో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి.

- వార్త, ఫొటోలు 8వ పేజీలో

అర్హులందరికీ ఇళ్లు

- పేదల గృహ నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం
- గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థ సారథి
- పనులు ప్రారంభమైన వాటిని ముందు పూర్తి చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు
- పనులు జాప్యం చేసే కాంట్రాక్టర్లను ఉపేక్షించేది లేదు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రాబోయే నాలుగేళ్లలో ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థ సారథి పేర్కొన్నారు. గృహ నిర్మాణంపై హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. లేఅవుట్లలో మౌలిక ... మిగతా 6వ పేజీలో

రేషన్ పరేషాన్

- వృద్ధులు, దివ్యాంగుల ఆచూకీ కోసం డీలర్ల పాట్లు
- పౌర సరఫరాల శాఖ అందజేసిన జాబితాలో పేర్కొన్న చిరునామాలో కనిపించని వైనం
- రెండు రోజుల్లో ఇద్దరి నుంచి నలుగురికి మాత్రమే పంపిణీ



బియ్యం మూటలు తన వాహనంపై వేసుకుని బయలుదేరిన డీలర్

ఆరిలోవ/అక్కయ్యపాలెం/గాజువాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద రేషన్ బియ్యం పంపిణీ చేయడంలో డీలర్లు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూలై నెలకు సంబంధించి పంపిణీని నగరంలోని 641 డిపోల పరిధిలో గురువారం ప్రారంభించారు. డిపోల వారీగా వృద్ధులు/దివ్యాంగుల వివరాలను డీలర్లకు పౌర సరఫరాల శాఖ అందజేసింది. అయితే అధికారులు ఇచ్చిన జాబితాల్లో ఉన్న చిరునామాలకు వెళుతుంటే ఆయా ఇళ్లల్లో వృద్ధులు కనిపించడం లేదు. ఆరా తీస్తే మరోచోటకు వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. గతంలో ఇచ్చిన ఫోన్ నంబర్లు ఇప్పుడు పనిచేయడం లేదు. ఇక వృద్ధ దంపతుల్లో ఒకరు మృతిచెందితే మరొకరు కుమారుడు లేదా కుమార్తె వద్దకు వెళ్లిపోతుండడంతో వారి అడ్రస్ దొరకడం లేదు. అలాగే ఒక డిపో పరిధిలో కార్డు ఉండగా, మరో ... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటులో బ్లాస్ట్ ఫర్నేస్-3 పునఃప్రారంభం

- వచ్చే నెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఉత్పత్తి
- ...అయితే వర్షాలు కురిస్తే ముడి ఇనుము పరిస్థితి ఏమిటన్నదే ప్రశ్న - మెయిన్‌లో

జుత్తాడ హత్యల కేసులో ముద్దాయికి ఉరి

- పాత కక్షలతో 2021లో ఒకే కుటుంబంలో ఆరుగురిని హత్య చేసిన వైనం




ముద్దాయి బత్తిన అప్పలరాజు (ఫైల్ ఫొటో)

- నాలుగేళ్ల విచారణ అనంతరం తీర్పునిచ్చిన న్యాయస్థానం

- వివరాలు మెయిన్‌లో

నీటి సరఫరా బంద్



జనం గగ్గోలు

- పరిశ్రమల్లో ఉత్పత్తికి అంతరాయం
- నీటి సరఫరా విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె
- ఫలించని మేయర్ చర్చలు...
- నేడు కూడా కొనసాగించనున్నట్టు ప్రకటన
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారుల దృష్టి
- వార్డు సచివాలయాల సిబ్బందికి బాధ్యతలు.. అయినా అనుమానమే
- నగరంలో లేని కొత్త కమిషనర్
- నాయకులకు పట్టని ప్రజల ఇక్కట్లు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
నగరంలో 90 శాతం ప్రాంతాలకు శుక్రవారం నీటి సరఫరా నిలిచిపోయింది. ఒక్క స్టీల్ ప్లాంటు మినహా జిల్లాలో మిగిలిన పరిశ్రమలన్నీ నీటికి కటకటలాడాయి. చాలా వాటిల్లో ఉత్పత్తికి విఘాతం కలిగింది. జీవీఎంసీలో నీటి సరఫరా విభాగంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెకు దిగడమే దీనికి ప్రధాన కారణం.



కార్మికుల సమ్మెతో మూతపడిన ఏలేరు, రైవాడ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

వేతనాలు పెంచాలని అవుట్‌సోర్సింగ్ కార్మికులు చాలాకాలంగా కోరుతుండగా, గత డిసెంబరులో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున జీతం పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ విభాగంలో మొత్తం 1,274 మంది పనిచేస్తుండగా దీనివల్ల 900 మందికి ప్రయోజనం కలుగుతుంది. మే నెల నుంచి జీతాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అయితే అకౌంట్స్ విభాగం దీనికి అభ్యంతరం ... మిగతా 6వ పేజీలో

నేడు మేయర్‌తో చర్చలు

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కార్మిక సంఘ నాయకులు శనివారం ఉదయం చర్చలు నిర్వహించనున్నారు. జూన్ నెల నుంచి వేతనాలు పెంచడంతోపాటు జనవరి నుంచి ఎరియర్స్ కూడా చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పరిశ్రమలకు మినహాయింపు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నుంచి పరిశ్రమలకు మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం రాత్రి కార్మిక సంఘ నేతలతో చర్చలు జరిపారు. పరిశ్రమలకు ఇబ్బందిలేకుండా నీటి సరఫరాకు కార్మిక సంఘాల నేతలు అంగీకరించారు.

అందుబాటులోకి ఆర్థిక శాఖ భవనం

- ఫస్ట్ ఫ్లోర్‌లో జిల్లా ఖజానా కార్యాలయం ఏర్పాటు
- గ్రౌండ్ ఫ్లోర్‌కు త్వరలో సీతమ్మధార సబ్‌ట్రెజరీ తరలింపు
- మిగిలిన అంతస్థుల్లో ఏపీ ప్రభుత్వ బీమా సంస్థ, ఆడిట్ విభాగం, పే అండ్ అకౌంట్స్, ఇతర అనుబంధ విభాగాల ఏర్పాటు



జడ్పీ కార్యాలయం సమీపంలో నిర్మించిన భవనం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ఆర్థిక శాఖ పరిధిలోని విభాగాల కోసం జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్డులోని జల వనరుల శాఖ కార్యాలయ ఆవరణలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనం ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. ఐదు అంతస్థులు, యాభై వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మించిన భవనంలోకి శుక్రవారం జిల్లా ఖజానా కార్యాలయాన్ని తరలించారు. జిల్లా ఖజానా విభాగం ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ గోవిందరావు కొత్త కార్యాలయంలో పూజలు చేశారు. అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు నితిన్, వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆనంద్, ఇతర ఉద్యోగులు కొత్త కార్యాలయంలో తమకు కేటాయించిన సీట్ల నుంచి విధులు నిర్వహించారు. కాగా భవనం మొదటి అంతస్థును జిల్లా ఖజానా కార్యాలయానికి కేటాయించారు. సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఇదే భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోకి తరలించనున్నారు. రెండు నెలల్లో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఇక్కడ నుంచే పనిచేస్తుందని ఇన్‌చార్జి డీడీ గోవిందరావు తెలిపారు. కలెక్టరేట్ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న స్ట్రాంగ్ రూమ్ ... మిగతా 6వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో తహశీల్దార్ల కొరత

అల్లూరి జిల్లాలో ఎనిమిది పోస్టులు ఖాళీ

- విశాఖ, జిల్లాలో ఐదు, అల్లూరి జిల్లాలో మూడు...
- ఇన్‌చార్జులతో కాలక్షేపం
- రోజువారీ పాలనలో ఇబ్బందులు
- అడ్‌హాక్ పదోన్నతులతోనే సమస్య పరిష్కారం
- ఆ దిశగా దృష్టిసారించని మూడు జిల్లాల ఉన్నతాధికారులు



విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):
ఉమ్మడి విశాఖ జిల్లాలో తహశీల్దార్లకు కొరత ఏర్పడింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎనిమిది, విశాఖపట్నం జిల్లాలో ఐదు, అనకాపల్లి జిల్లాలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వచ్చే నెలలో విశాఖ జిల్లాలో మరో ముగ్గురు తహశీల్దార్లు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఖాళీల సంఖ్య ఎనిమిదికి పెరగనున్నది. పూర్తిస్థాయి తహశీల్దార్లు లేకపోవడంతో మండలాల్లో పాలనపై ప్రభావం పడుతోంది. అయితే తహశీల్దారు ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. కానీ, సర్వీస్ కమిషన్ ద్వారా వచ్చిన ప్రొడీటీలు, జూనియర్ అసిస్టెంట్ నుంచి పదోన్నతి ద్వారా డిప్యూటీ తహశీల్దార్లు అయిన వారి మధ్య కోర్టులో వివాదం ఉండడంతో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలంటే ప్రస్తుతం సీనియర్ డీటీలకు అడ్‌హాక్ పదోన్నతులు కల్పించి తహశీల్దార్లుగా నియమించవచ్చు. ఇందుకోసం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సీనియర్లతో జాబితా సిద్ధం చేసి భూపరిపాలనా ముఖ్య కమిషనర్ అనుమతి తీసుకున్నారు. కానీ ఎందుచేతనో ఆ దిశగా ఇంకా ప్రయత్నాలు ప్రారంభించలేదు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఇటీవల చేపట్టిన బదిలీల్లో పలువురు తహశీల్దార్లు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వెళ్లారు. అల్లూరి జిల్లా నుంచి ... మిగతా 6వ పేజీలో

జూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- సింగపూర్ జూను నిర్వహిస్తున్న మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో మాస్టర్ ప్లాన్ తయారీ
- కేంద్రం ఆమోదిస్తే రూ.75 కోట్ల నిధులు
- పదేళ్లలో పర్యాటకులు కోటికి చేరేలా ప్రయత్నం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
విశాఖపట్నం జంతు ప్రదర్శనశాల (జూ)ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న సింగపూర్ జూ తరహాలో విశాఖ జూను అభివృద్ధి చేయాలనేది ప్రజా ప్రతినిధుల ఆలోచన. విశాఖపట్నం జూ 625 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అందులో 300 ఎకరాలు కొండ. మిగిలిన 325 ఎకరాల్లో జంతువులను సంరక్షిస్తున్నారు. దీనికి ఎదురుగా కంబాలకొండ అభయారణ్యం ఉంది. ఈ రెండింటినీ కలిపి అభివృద్ధి చేయనున్నారు.

విశాఖ జూలో వంద రకాల జంతువులు వేయి వరకూ ఉన్నాయి. ప్రస్తుతం అధికారులు జంతు సంతతిని సంరక్షించడంతో పాటు వాటి సంఖ్య పెంచడంపైనా దృష్టిపెట్టారు. వైల్డ్ డాగ్‌లను ప్రభుత్వం అంతరించిపోతున్న జాతిగా గుర్తించింది. వాటిని ఇక్కడ ప్రత్యేకంగా సంరక్షిస్తూ కొత్తగా జన్మించిన వాటిని ఇతర జూలకు పంపుతున్నారు. ఆ జాతికే చెందినవే 40 వరకు ఉండడం గమనార్హం.

పర్యాటక అభివృద్ధి కోసం

సింగపూర్ జూ కూడా విస్తీర్ణంలో దాదాపుగా విశాఖపట్నం జూలానే ఉంటుంది. కాకపోతే అక్కడ జంతువుల సంఖ్యతో పాటు సందర్శించే వారి సంఖ్య కూడా అధికమే. ఏటా 5 కోట్ల



మంది ఆ జూను సందర్శిస్తుంటే... విశాఖ జూని సందర్శించే వారి సంఖ్య ఎనిమిది లక్షలకే పరిమితంగా ఉంది. సింగపూర్ ప్రభుత్వానికి జూ ద్వారా ఏడాదికి రూ.7 వేల కోట్ల ఆదాయం వస్తోంది. సింగపూర్ ప్రజలతో పాటు ఇతర దేశాలవారు చూసిన జూనే మళ్లీ మళ్లీ చూడడానికి వెళుతుంటారు. జంతువులతో అనుబంధం పెంచుకుంటున్నారు. ఇక్కడ కూడా ... మిగతా 6వ పేజీలో

నీటి సరఫరా విభాగం సిబ్బంది ఆందోళన



ఆందోళన చేస్తున్న నీటి సరఫరా విభాగం సిబ్బంది

భీమునిపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నుంచి నీటి సరఫరా విభాగం సిబ్బంది సమ్మెలోకి దిగడంతో భీమిలి జోన్‌లో మంచినీటి కొళాయిల్లో నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా, నీటి సరఫరా విభాగం సిబ్బంది భీమిలి జోనల్ కార్యాలయం ముందు సమస్యలు పరిష్కరించాలని, తక్షణం వేతనాలు పెంపుదల చేయాలని నినాదాలు చేశారు. అలాగే, పట్టణంలో మోటారు బైకులతో పర్యటిస్తూ ప్రతీ జంక్షన్‌లలో తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని నినాదాలు చేశారు.

దివీస్‌కు రెడ్ క్రాస్ అవార్డు



రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి అవార్డు అందుకుంటున్న దివీస్ ప్రతినిధులు

భీమునిపట్నం (రూరల్) జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రక్తదాన శిబిరాలను నిర్వహించి ఉద్యోగుల నుంచి రక్తసేకరణ చేసి రక్తనిధికి రక్తాన్ని అందిస్తున్నందుకు రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి దివీస్‌కు పురస్కారం లభించింది. శ్రీకాకుళం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ తరపున ఆ జిల్లా కలెక్టరు దినకర్ పూడ్కర్ ఈ పురస్కారాన్ని దివీస్ ప్రతినిధులు మల్లికార్జున పి.మహేంద్రలకు అందజేశారు. ఈ పురస్కార ప్రదానం సందర్భంగా దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేస్తూ గత 15 సంవత్సరాల నుంచి రక్తసేకరణ చేస్తున్నామని అన్నారు. వెయ్యి యూనిట్లు రక్తాన్ని అందించామని అన్నారు.

హౌసింగ్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి

ఆనందపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిడిజాల ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టును మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే గంటి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడంతో పాటు హౌసింగ్ కాలనీలో నిర్దేశించిన గడువులోగా విద్యుత్, మంచినీరు, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పించాలని అధికారులను ఆదేశించారు. గిడిజాల హౌసింగ్ ప్రాజెక్టులో పట్టాలివ్వకుండా మిగిలిన భూమిని మళ్లీ లే అవుట్ వేసి అర్హులైన వారికి కొత్త నిబంధనల ప్రకారం స్థలాన్ని ఇస్తామని పేర్కొన్నారు. 2014-2019 మధ్యలో టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో 20 లక్షల హౌసింగ్‌ను కేంద్రం మంజూరు చేసిందని, వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వల్ల సకాలంలో నిర్మాణాలు పూర్తి కాలేదని ఆరోపించారు. 10 ఏళ్ల క్రితం ఒక్కో యూనిట్‌కు 2.50 లక్షలు కేటాయించగా, వైసీపీ ప్రభుత్వం ఆ మొత్తంలో 30 వేల రాష్ట్రం వాటాను కోత పెట్టిందని విమర్శించారు. మంచినీటి సరఫరా కోసం ఉద్దేశించిన జల్‌జీవన్ మెషీన్ ఓ రాష్ట్రం వాటాను కేటాయించని కారణంగా రూ.25 వేల కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయాయని వైసీపీ పాలనపై విరుచుకుపడ్డారు. భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని తంగుడుబిల్లి, గిడిజాల కాలనీల్లో 15 వేల హౌసింగ్ నిర్మాణం జరుగుతుందని, ఈ కాలనీల్లో యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానికంగా ఉంటున్న ప్రజలకు ఈ హౌసింగ్ కాలనీలలో ఖాళీ ప్లాట్లను కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకురాగా దానికి



గృహాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి పార్థసారధి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మంత్రి అంగీకరించారని పేర్కొన్నారు. అర్హత గల ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. ముందుగా కాలనీలో సందర్శించి అక్కడి వివరాలను అధికారులను అడిగి తెల్సుకున్నారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే దువ్వారపు రామారావు, మండల నాయకులు గంర్రెడ్డి స్వామినాయుడు, ఘట్టమనేని సుభాస్‌చంద్రబోస్, కోరాడ రాము, బీఆర్‌బీ నాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కర్రి శ్రీను, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, కోరాడ వైకుంఠరావు, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుడి రథోత్సవం



జగన్నాథస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

భీమునిపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీ జగన్నాథుని తొలి రథోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం జగన్నాథుడి ఆలయంలో ఉన్న శ్రీబలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించిన రథంపై ఆశీనులను గావించారు. అనంతర విశేషంగా భీమిలి పరిసరాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు స్వామివారిని దర్శించుకున్నారు. రథంపై శ్రీజగన్నాథస్వామివారిని దర్శించుకున్న భక్తులు తిరిగి అదే మార్గంలో కాకుండా వేరే మార్గంలో వెళ్లేటట్లు రథాన్ని రీ మోడల్ చేయడంతో భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనాలు జరిగాయి. గతంలో రథంపైకి మెట్లపై వెళ్లిన భక్తులు తిరిగి అదే మార్గంలో రావలసివచ్చేది. ఇపుడు వేరే మార్గం ఏర్పాటు చేశారు. తొలుత ఒడిశా పండా వంశీయులైన అల్లం ఉగ్రనరసింహమూర్తి కుటుంబీకులు మొదటిగా పూజలు చేశారు. తర్వాత భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం, పట్టణంలో మెయిన్‌రోడ్, గంటస్తంభం, గుప్తావీధి, శ్రీలక్ష్మీనరసింహస్వామి వీధి, శ్రీకన్యకాపరమేశ్వరి వీధుల మీదుగా స్వామి రథాయాత్ర భక్తుల జయజయధ్వానాలతో శోభాయాత్ర ఘనంగా ఇంద్రద్యుమ్న మందిరానికి చేరింది. అక్కడ శ్రీజగన్నాథస్వామికి జేజేలు పలుకుతూ రథంపై నుంచి బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిల విగ్రహాలను భక్తులు తొడ్కోని అందంగా అలంకరించిన ఇంద్రద్యుమ్న మందిరంలోకి తీసుకువెళ్లి ఆశీనులను చేశారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలల్లోని పలు పరిశ్రమలలో పని చేస్తున్న ఒడిశావాసులు, ప్రజలు, భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని, రథయాత్రలో పాల్గొన్నారు. ఆలయ వంశపారం పర్యార్చకులు రొంపిచెర్ల శింగరాచార్యులు, లక్ష్మీనరసింహ ప్రసాధాచార్యులు, కృష్ణమాచార్యులు, సుసరాపు కామేశ్వర మధు శాస్త్రి, వంశీమోహన చెన్నకృష్ణమాచార్యులు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు, భక్తులు ముమ్మిడిశెట్టి సత్యానందం, కంటుభుక్త ముత్యాలరావు, గుర్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి : డీపీవో

పద్మనాభం-రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి పి.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం అయన రెడ్డిపల్లి గ్రామంలో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. సకాలంలో వాటర్ ట్యాంకులను పరిశుభ్ర పరచాలని సూచించారు. పారిశుధ్య సిబ్బందికి ప్రజలు తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం అయన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిపాలన విదానంపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఈవో పీఆర్డీ మీనాకుమారి. తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయ పర్యవేక్షణాధికారి సస్పెన్షన్

సింహాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులును సస్పెం డ్ చేస్తూ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానాలయాల్లో మౌలిక వసతులపై ఐవీఆర్ఎస్ (ఇంటర్నెట్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా భక్తుల అభి ప్రాయాలను తెలుసుకుంటున్నారు.

వసతులు, దర్శనాలు, ప్రసాదాల నాణ్యత వంటి వాటిపై నిత్యం వెయ్యి మంది నుంచి అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది. ఈ క్రమంలో సింహాద్రి అప్పన్న ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు దేవదాయశాఖ రాష్ట్ర అధికారులు గుర్తించి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈఓ ఆయనను సస్పెండ్ చేశారు.

అప్పన్నకు ఒడిశా దాసుడి ఊంజల్ సేవ



లక్ష్మీనర్సింహస్వామి ఊంజల్ సేవలో పాల్గొన్న ఈఓ, ఒడిశా దాసుడు



సేవలో పాల్గొన్న ఒడిశా భక్తులు

సింహాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఒడిశాకు చెందిన ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు తన పరివారంతో కలిసి భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఊంజల్ సేవ నిర్వహించారు. సాయంత్రం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా సకల స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, పుష్పమాలికలతో అలంకరించి శేషపాన్పు ఆకారంలో ఊంజలపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు డా.రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు కె.సీతారామాచార్యులు, ఇతర వైదికులతో కలిసి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు, షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. విశేష ఫలనివేదనల అనంతరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావుతో కలిసి లక్ష్మీకాంత్ నాయకో దాసుడు స్వామివారున్న ఊంజలను భక్తితో ఊపారు. ఈ సందర్భంగా ఒడిశా దాసుడి బృందం భక్తిగీతాలతో కీర్తించారు. అనంతరం వారు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా నిత్యకల్యాణం: వరాహలక్ష్మీ నృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనల అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో జీలకర్ర, బెల్లం, మాంగల్యధారణ జరిపి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అర్హులందరికీ ఇళ్లు

... 5వ పేజీ తరువాయి

సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. తాగునీటి కోసం ప్రభుత్వం నుంచి కూడా నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పనులు మొదలైన వాటిని 100 శాతం పూర్తిచేయాలని, గ్రౌండ్ కానీ వాటిని ప్రారంభించవద్దన్నారు. గతంలో అనర్హులకు ఇచ్చినట్టయితే వారిని తొలగించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ప్రగతి చూపని కాంట్రాక్టర్లను ఉపేక్షించేది లేదన్నారు. హౌసింగ్ అధికారులు రోజువారీ లక్ష్యాలు విధించుకుని,ఈ ఏడాది చివరి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హుద్‌హుద్ ఇళ్లు అప్పటి జాబితా ప్రకారమే లబ్ధిదారులకు అందించాలన్నారు. ముదపాక లేఅవుట్‌పై కోర్టు కేసును జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు రైతులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ లేఅవుట్లలో తాగునీటి కోసం జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తీసుకుని మొదటి దశలో రూ.20 కోట్లు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి కొన్ని నిధులు మంజూరు చేయించాలన్నారు. గడిచిన మూడు నెలలుగా జిల్లాలో ఇళ్ల నిర్మాణం వేగవంతమైందన్నారు. 2026 మార్చిలోగా నూరుశాతం పూర్తిచేస్తామని కలెక్టర్ వెల్లడించారు.సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, హౌసింగ్ సీఈ రామ్మోహన్‌రావు, పీడీ సత్తిబాబు, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల కమిటీ సభ్యత్వానికి దరఖాస్తులు

కొమ్మాది, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వీధి విక్రయదారుల నగర కమిటీ సభ్యత్వానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. ఈ కమిటీలో నలుగురు అనధికార సభ్యులను మూడేళ్ల కాలపరిమితికి ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు పంపాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనిదినాలలో యు.సి.డి అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీరామ్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

టైమ్స్ వరల్డ్ ర్యాంకింగ్‌లో గీతం వర్సిటీకి 81వ స్థానం

సాగర్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి యూకే ఆధారిత ర్యాంకింగ్ సంస్థ టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను ప్రకటించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్, ర్యాంకింగ్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజాప్రభు తెలిపారు. నాణ్యతతో కూడిన ఉన్నత విద్య, పరిశ్రమలతో సంబంధాలు, నూతన ఆవిష్కరణలు వంటి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను పరిశీలించిన అనంతరం ఈ ర్యాంకింగ్ కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ విభాగంలో ప్రపంచంలో 81వ స్థానం, దేశంలో 10వ స్థానం, ఆంధ్రప్రదేశ్ 1వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

రేషన్ పరేషాన్

... 5వ పేజీ తరువాయి

డిపో పరిధిలో ప్రస్తుతం వృద్ధులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఇచ్చిన జాబితాలో పేర్కొన్న కార్డుదారుల్లో ఇద్దరు నుంచి ఐదుగురికి మాత్రమే డీలర్లు ఈ రెండు రోజుల్లో బియ్యం ఇవ్వగలిగారు. గత ప్రభుత్వంలో డీలర్లకు, కార్డుదారులకు మధ్య ఎటువంటి సంబంధాలు లేవు. ఎండీయూల ద్వారా బియ్యం పంపిణీ చేయడంతో కార్డుదారుల్లో ఎవరెక్కడ ఉన్నారో డీలర్లకు ఇప్పుడు తెలియడం లేదు. వచ్చే ఐదారు రోజుల్లో వృద్ధులందరికీ రేషన్ పంపిణీ చేయలేమని అంటున్నారు. గాజువాక పరిధిలో ఒక డీలరు రెండు రోజుల్లో కేవలం నలుగురికే బియ్యం ఇచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బందికి తమ పరిధిలో వృద్ధులు, దివ్యాంగుల నివాసాలు తెలుసునని, వారి సాయం తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయాలని డీలర్లు కోరుతున్నారు.

రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం

సింహాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయంగా పిలిచే సీతారామ స్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనాన్ని శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాముని జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని నెలకోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

'డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె'

మధురవాడ, ఎండాడలో తాగునీటి సరఫరా సిబ్బంది నిరసన

మధురవాడ/ఎండాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ నీటిసరఫరా సిబ్బంది, కార్మికులు శుక్రవారం ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిరసన తెలిపారు. తాగునీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పెంచిన జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 2024 డిసెంబరు 11న ఒప్పందం కుదిరినా ఇంతవరకు వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికుల కుటుంబాలు చాలీచాలని వేతనాలతో వీధినపడుతున్నాయని, తప్పనిసరి పరిస్థితిలో సమ్మె చేయవలసి వచ్చిందన్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి పాత బకాయిలు సహా పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతవరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక నాయకులు ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో ఎండాడ సెక్షన్ అధ్యక్షుడు చిన్నారావు, ఉపాధ్యక్షుడు సతీష్, కార్యదర్శి రవి, కె.వెంకటేష్, భాస్కర్, రమేష్, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు. సిబ్బంది సమ్మె కారణంగా శుక్రవారం మధురవాడలో తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్వతంత్రనగర్, చంద్రంపాలెం, వాంబేకాలనీ, మిధిలాపురి, వుడాకాలనీ, బింద్రానగర్, పోర్టుకాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం తదితర ప్రాంతాల కు నీరు సరఫరా కాలేదు.



ఎండాడలో నిరసన నినాదాలు చేస్తున్న కార్మికులు

మంగమారిపేటలో బడిబాట ర్యాలీ

భీమునిపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.

అందుబాటులోకి ఆర్థిక శాఖ భవనం

... 5వ పేజీ తరువాయి

అక్కడే కొనసాగుతుందన్నారు.

కాగా ఖజానా కార్యాలయం దశాబ్దాలుగా కలెక్టరేట్‌లోని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో కొనసాగింది. అయితే ఫస్ట్ ఫ్లోర్ పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పలుమార్లు మరమ్మతులు చేశారు. అయినా వర్షాకాలం వస్తే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించేవారు. రెండేళ్ల క్రితం ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. మిగిలిన భాగం ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన వ్యక్తమైంది. గత నెల గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చే మెట్లు కూలిపోయి అటెండర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కలెక్టర్ స్పందించి వెంటనే కొత్త భవనంలోకి మార్చాలని ఆదేశించారు. కొత్త భవనంలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పూర్తికావడంతో శుక్రవారం ఖజానా కార్యాలయాన్ని తరలించారు.

భవనంలోకి ఆర్థిక శాఖ అనుబంధ విభాగాలు

ఆర్థిక శాఖ పరిధిలో అనుబంధ విభాగాల కోసం జల వనరుల శాఖ ఈఈ కార్యాలయ ఆవరణలో బహుళ అంతస్థుల భవన నిర్మాణానికి గతం (2014-19)లో టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏపీ ప్రభుత్వ బీమా సంస్థ, సబ్ ట్రెజరీ, ఫస్ట్ ఫ్లోర్‌లో జిల్లా ట్రెజరీ, మిగిలిన అంతస్థులలో ఆడిట్ విభాగం, పే అండ్ అకౌంట్స్, ఇతర అనుబంధ విభాగాల ఏర్పాటుకు అనుగుణంగా భవనం డిజైన్ చేశారు. ఏపీ విద్యా మౌలిక వసతుల ఇంజనీరింగ్ సంస్థ సుమారు రూ.25.1 కోట్లతో పనులు చేపట్టింది. 2019 నాటికి మెజారిటీ నిర్మాణ పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తి, ఫర్నీచర్, ఏసీలు, విద్యుత్ సౌకర్యం కల్పించడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. వైసీపీ హయాంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాంట్రాక్టర్‌కు కొంతమేర బిల్లులు, విద్యుత్ సౌకర్యం కోసం ఈపీడీసీఎల్‌కు రుసుం చెల్లించింది.

జూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

అలాంటి వాతావరణమే తీసుకురావాలని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సింగపూర్ జూను నిర్వహిస్తున్న మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులను ఇటీవల విశాఖపట్నం రప్పించి జూ మొత్తం చూపించారు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి వారితో మాస్టర్ ప్లాన్ తయారుచేయించారు. పర్యాటకులకు మరిన్ని వసతులు, సదుపాయాలు, వారిని ఆకర్షించే అంశాలు అందులో ఉండేలా సూచనలు చేశారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి కేంద్రానికి సమర్పిస్తారు. ఆమోదం లభిస్తే నిధులు వస్తాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి చేస్తారు.

రూ.75 కోట్లతో మొదటి దశ పనులు

- శ్రీభరత్, ఎంపీ, విశాఖపట్నం

సింగపూర్ బృందం తయారుచేసిన మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభిస్తే కేంద్రం నుంచి రూ.75 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు నిధులు వస్తాయి. వాటితో మొదటి దశ పనులు చేపట్టి రాబోయే పదేళ్లలో సందర్శకుల సంఖ్యను కోటి వరకు పెంచాలని యోచిస్తున్నాము. గతంలో సందర్శకులకు టాయ్ ట్రైన్ ఉండేది. నిర్వహణ లేక మూలపడింది. దానిని పునరుద్ధరించడంతో పాటు ఇంకా అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

ఉమ్మడి జిల్లాలో తహశీల్దార్ల కొరత

... 5వ పేజీ తరువాయి

ఇద్దరిని విశాఖ జిల్లాకు, ముగ్గురిని అనకాపల్లి జిల్లాకు, అనకాపల్లి జిల్లా నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. అయితే అనుకూలమైనచోట పోస్టులు రాలేదని విశాఖ జిల్లాలో ఇద్దరు తహశీల్దార్లు సీసీఎల్‌కు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అల్లూరి జిల్లా నుంచి ఇద్దరు తహశీల్దార్లు ఇంకా విశాఖ జిల్లాకు రాలేదు. ప్రస్తుతం విశాఖ జిల్లాలో గాజువాక, పెందుర్తి, ఆనందపురం, సీతమ్మధార, ములగాడ మండలాలకు తహశీల్దార్లను నియమించాల్సి ఉంది.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏకంగా ఎనిమిది మంది తహశీల్దార్లు కొరత ఏర్పడడంతో పాలన ముందుకుసాగడం లేదనే వాదన ఉంది. చింతపల్లి, జి.మాడుగుల, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాలకు పూర్తిస్థాయి తహశీల్దార్లు లేరు. అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో ఒక సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జులు ఉన్న మండలాల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. కనీసం విద్యార్థులకు ధ్రువపత్రాలు కూడా సకాలంలో జారీకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా నుంచి అనకాపల్లికి బదిలీ అయిన ఇద్దరూ అక్కడ చేరలేదు. దీనికితోడు మరో ఖాళీ ఉంది. దీంతో అనకాపల్లి జిల్లాలో మూడు ఖాళీలు ఉన్నట్టుగా గుర్తించారు. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లలో కొద్దిమందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. అప్పుడు తహశీల్దార్ పోస్టులు మరికొన్ని ఖాళీ అవుతాయి. ఈలోగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండలాల్లో సీనియర్ డీటీలకు అడ్‌హాక్ పదోన్నతులు ఇస్తే పాలన సజావుగా సాగుతుంది. ఇందుకు మూడు జిల్లాల కలెక్టర్లు సమావేశమై నిర్ణయం తీసుకోవల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల జాప్యం జరుగుతోందంటున్నారు.

నీటి సరఫరా బంద్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తంచేస్తుంది. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా కేవలం కౌన్సిల్ తీర్మానంతో వేతనాలు పెంచడానికి అవకాశం లేదని ఆ ఫైల్‌ను ఆపేసింది. దాంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మే నెలకు సంబంధించి పాత జీతాలే వచ్చాయి. దాంతో వారు సమ్మెకు దిగుతామని ఈ నెల మొదటి వారంలో ప్రకటించారు. నగరంలో యోగాంధ్ర కార్యక్రమం ఉన్నందున 15 రోజులు సమయం కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు వారిని కోరారు. అయితే తాజాగా జూన్ నెలకు సంబంధించిన వేతనాలు కూడా పాత విధానంలో ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలియడంతో జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ లేబర్ యూనియన్ శుక్రవారం నుంచి సమ్మె చేయనున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ విషయం తెలిసినా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గానీ వారితో సంప్రతింపులు జరపలేదు. దాంతో కార్మికులు చెప్పినట్టుగానే శుక్రవారం సమ్మెకు దిగడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. దాంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడ్డారు. నగరంలో పెద్ద పెద్ద అపార్టుమెంట్లన్నీ జీవీఎంసీ నీటిపైనే ఆధారపడుతున్నాయి. వాటిలో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. చాలా అపార్టుమెంట్లలో ట్యాంకులు ఖాళీ అయిపోయాయి. బయట నుంచి తెప్పించుకుందామన్నా అక్కడ కూడా సిబ్బంది సమ్మెలో ఉన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ నగరంలో లేరు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఇతర ప్రాంతాల పర్యటనలో ఉన్నారు. మిగిలిన ప్రజా ప్రతినిధులు నగరానికి ఇద్దరు మంత్రులు రావడంతో వారితో కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు కార్మిక సంఘాలతో చర్చలు జరపగా, వారు పెంచిన జీతాలు ఈ నెల నుంచి ఇస్తేనే పనిచేస్తామని, అంతవరకు సమ్మెలోనే ఉంటామని చెప్పి బయటకు వచ్చేశారు. దాంతో శనివారం కూడా నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఎదురైంది. చాలామంది ప్రజా ప్రతినిధులకు నగరంలో నీటి సరఫరా లేదని, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారనే విషయం కూడా తెలియకపోవడం గమనార్హం.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు... ఫలితం అంతంత మాత్రం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ మాట వింటారని ఉన్నతాధికారులు ధీమాగా ఉండి శుక్రవారం సాయంత్రం వరకూ ఏమీ పట్టించుకోలేదు. వారు సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేయడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. ఉద్యోగులు ఎవరూ సెలవులు తీసుకోవద్దని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం అంతా అప్రమత్తంగా ఉండి, వార్డు సచివాలయాల ఎమినిటీస్ (సౌకర్యాలు) కార్యదర్శితో నీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశాలు ఇచ్చారు. 98 వార్డులను సందర్శిస్తూ నీరు అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పగించారు.

నీటి సరఫరా వీజీ కాదు

నగరానికి నీటి సరఫరా చేయడం అంటే అంత తేలికైన విషయం కాదు. రైవాడ, తాటిపూడి రిజర్వాయర్ల వద్ద నీటి పంపింగ్‌ను పర్యవేక్షించే సిబ్బంది ఉండాలి. ఏలేరు కాలువ నుంచి గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని నిర్వహించే వారు ఉండాలి. అక్కడి నుంచి వచ్చిన నీటిని నగరంలో గల రెండు వేలకు పైగా ట్యాంకులకు ఎక్కించాలి. ఆ నీటిని మళ్లీ బూస్టర్ పంపింగ్ స్టేషన్ల ద్వారా సరఫరా చేయాలి. ప్రతి వార్డుకు టర్న్ కాక్‌లు వెళ్లి నీటి సరఫరా వాల్వ్‌లు విప్పితేనే ఆ ప్రాంతానికి నీరు అందుతుంది. ఈ క్రమంలో వాల్వ్ చెకర్లు, వాటర్ క్వాలిటీ తనిఖీ చేసేవారు ఇంకా అనేక మంది పనిచేయాల్సి ఉంటుంది. పై నుంచి నీరు రాకుండా వార్డు సచివాలయాల సిబ్బంది ఏమీ చేయలేరు. అత్యంత అవసరమైన తాగునీటి సరఫరాలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలతో పాటు పరిశ్రమలనిర్వాహకులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కార్మికుల సమ్మెను విరమింపజేసి శనివారం యథాప్రకారం నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతు బజార్ సందర్శించిన మార్కెటింగ్ శాఖ డీడీ



టమాట నాణ్యతను పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసకిరణ్

ఎంవీపీ కాలనీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను మార్కెటింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్ శుక్రవారం సందర్శించారు. టమాటా, ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించారు. నాణ్యత గల కూరగాయలను మాత్రమే విక్రయించాలని, అలాగే రైతులు.. కొనుగోలుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాని సూచించారు. బజార్‌లోని స్టాళ్ల వద్దకు వెళ్లి రైతుల గుర్తింపు కార్డులను తనిఖీ చేశారు.

వీఎంఆర్డీఏ కమిషనర్‌ను సత్కరించిన చైర్మన్ ప్రణవ్‌గోపాల్

యోగాంధ్ర విజయంపై అభినందనలు



వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను సత్కరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంతో ప్రతిష్టాత్మకంగా నగరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథ్‌ను శుక్రవారం వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ సత్కరించారు. రేయింబవళ్లు ఉద్యోగులతో కలిసి పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని అభినందించారు.

నేడు నాట్య పుష్కరాలు

వెంకోజీపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : సాయిసురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం సాయంత్రం 'నాట్య పుష్కరాలు' నిర్వహించనున్నట్టు అకాడమీ నిర్వాహకులు భాను రేఖ అట్టాడ, సాయి సురేఖ అట్టాడ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము నాట్యం మొదలు పెట్టి 12 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పుష్కరాలలో చిన్నారులచే వివిధ రాష్ట్రాలకు చెందిన నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. సాయంత్రం 3 గంటల నుంచి ఈ ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. నాట్య అభిమానులంతా పాల్గొని తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమానికి పలువురు నాట్య ప్రముఖులు హాజరు కానున్నట్టు తెలియజేశారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 34, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60,బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీర దోస 32, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతుధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

అంగరంగ వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

- ఉత్కల్ సంస్కృత్ సమాజ్ ఆధ్వర్యంలో వేడుకలు
- భారీగా తరలి వచ్చిన భక్తజనం

సిరిపురం/ రామ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా రేడియో వద్దనున్న ఉత్కల్ సంస్కృత్ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం జగన్నాథుడి రథయాత్రను కన్నులపండువగా నిర్వహించారు. జగన్నాథుడు, బలభద్రుడు, దేవీసుభద్ర దేవతామూర్తులను సంప్రదాయ రీతిలోని హపండి బీజే ఆచారంలో సాయంత్రం 4.30 గంటలకు ఆలయంలోని గర్భ గుడి నుంచి ఉత్సవంగా బయటకు తీసుకొచ్చి అత్యంత సుందరంగా అలకరించిన రథంపై ఉంచారు. తదుపరి చెరా పహాంరా ఆచారంలో భాగంగా రథ వేదికను జేకే నాయక్ భక్తిశ్రద్ధలతో ఊడ్చారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి భక్తులు 'హరీబోల్..' అంటూ సంకీర్తనల నడుమ జై...జగన్నాథ్ అంటూ రథాన్ని లాగారు. అక్కడ నుంచి రథయాత్ర సిరిపురం ఆలిండియా రేడియో మీదుగా వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్, హెచ్‌పీసీఎల్ బ్యాంకు, ఏయూ గేట్, పార్కు హోటల్ వుడా పార్కు మీదుగా లాసన్స్‌బే కాలనీలో శ్రీగుండిచా ఆలయానికి చేరుకొంది. రథయాత్రలను మార్వారీ యువమంచ్ తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేయగా, విష్ణుప్రసాద్ అగర్వాల్, దీప్తిమయి మార్గంలోని భక్తులకు ప్రసాదవితరణ చేపట్టారు. పలువురు కళాకారులు ప్రదర్శించిన భక్తి నృత్యం, సంగీతంతో వేడుకలు మరింత ఆహ్లాదకరంగా సాగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులకు కలగకుండా సమాజ్ కార్యదర్శి బినాల్‌కుమార్ మహంత, ఇతర సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) రథవేదికను ఊడ్చేందుకు సిద్ధమైన ఉత్కల్ సంస్కృత్ సమాజ్

ఆరిలోవలో..

ఆరిలోవ జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ చివరి బస్టాప్ దగ్గర నూకలమ్మ గుడి పక్కన తూర్పునియోజకవర్గం శాసన సభ్యులు వెలగ పూడి రామకృష్ణబాబు సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన జగన్నాథ స్వామి ఆలయంలో వద్ద శుక్రవారం జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయం నుంచి జగన్నాథ స్వామి రథ యాత్ర ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, సిద్ధార్థ నగర్, శివాజీ నగర్, కనకమహాలక్ష్మీనగర్ మీదుగా సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ కెల్ల సునీతాసత్యనారాయణ, వార్డు అధ్యక్షుడు పోత్రకొండ ధర్మారావు, వార్డు కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

- ఎంపీ శ్రీభరత్
- విశాఖ వ్యాలీ స్కూలులో యంగ్ ఇండియన్స్ 2.0



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, పాల్గొన్న ఇతర ప్రముఖులు

ఆరిలోవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సీఐఐ యువ విభాగమైన యంగ్ ఇండియన్స్ (వైఐ) ఆధ్వర్యంలో విశాఖ వ్యాలీ స్కూలులో యంగ్ ఇండియన్స్ 2.0 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం నేడు మరింత ఉందన్నారు. యువతను ఉత్సాహపరిచేలా తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 100కు పైగా ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులు పాల్గొని భారత పార్లమెంటరీ వ్యవస్థ గురించి విలువైన సమాచారాన్ని తెలుసుకున్నారు. వాస్తవిక చర్చలు, వాదనలు, శాసన ప్రక్రియలు, అనుసరణ ద్వారా విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా పాల్గొని శాసన వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ప్రత్యేక అనుభవం ద్వారా పొందారు. ఈ కార్యక్రమానికి యంగ్ ఇండియన్స్ వైజాగ్ చైర్మన్ డాక్టర్ శ్రావణి బెల్లం, కో-చైర్మన్ దీప కొడాలి, సుప్రియ సురపనేని (థలిర్ చైర్) నాయకత్వం వహించారు. పలువురు యంగ్ ఇండియన్ సభ్యులు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.

బాలికలు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలి

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తి సన్యాసినాయుడు



బాలికలతో మాట్లాడుతున్న జస్టిస్ సన్యాసినాయుడు

ఆరిలోవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రత్యేక బాలికల పరిశీలన గృహంలో ఉన్న బాలికలంతా బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయమూర్తి ఆర్. సన్యాసినాయుడు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం విశాఖ వ్యాలీ స్కూల్ సమీపంలో గల ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహాన్ని ఆయన సందర్శించారు. అక్కడి బాలికలతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని, అలాగే వృత్తి విద్యలను నేర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఆయన వైద్యులతో మాట్లాడుతూ ప్రతి రోజు బాలికల ఆరోగ్య పరిస్థితులను గమనించాలని, అవసరమైన వారికి తగిన మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల పరిశీలన గృహం సూపరింటెండెంట్ నయోమి, వైద్యురాలు శోభారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 17 వినతులు



వినతులను స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు సంబంధించి 17 వినతులు అందినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహించారు. జోన్ 2కు 01, 3వ జోన్‌కు 4, 5వ జోన్‌కు 5, 6వ జోన్‌కు 1, జోన్ 7కు 1, జోన్-8కు 5 వినతులు వచినట్టు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ఎస్.కోట టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా మళ్ల రవికుమార్



వెంకోజీపాలెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించి విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా పాతవెంకోజీపాలేనికి చెందిన టీడీపీ 15వ వార్డు ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్‌ను అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో ఆషాడ మాసం ప్రత్యేక పూజలు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాక 16వ వార్డు హెచ్‌బీ కాలనీ కనకదుర్గా ఆలయంలో శుక్రవారం ఆషాడ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చందనంలతో అభిషేకాలు నిర్వహించి, అనంతరం అమ్మవారికి కన్నుల విందుగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిపి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రోటరీ క్లబ్, విశాఖ వ్యాలీ, విజన్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో

స్మార్ట్ విజన్ గ్లాసెస్ పంపిణీ



విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

సిరిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, విశాఖ వ్యాలీ, విజన్- ఎయిడ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో శుక్రవారం దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు స్మార్ట్ విజన్ గ్లాసెస్ 10 సెట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీధర్మసాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమాండర్ సి.శివరావు, విజన్-ఎయిడ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఎల్ నరసింహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక సహాయ సాంకేతికతను అందించడం ద్వారా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు మరింత స్వతంత్రంగా నేర్చుకునే అవకాశాలను కల్పించడాన్ని లక్ష్యంగా సాధ్యపడుతుందన్నారు. విజన్ ఎయిడ్ ఇండియా సహకారంతో కమాండర్ శివరావు వారి కుటుంబం తరపున స్వర్గీయ రమణిశివరావు, చెరుకుపల్లి స్మృతిగా వీటిని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ ప్రతినిధులకు దాతలకు కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ పి.రఘు, క్లబ్ సభ్యులు కంటిపూడి వెంకటేశ్వరరావు, హేమంతకుఆర్, హనుమంతరావు, కమాండర్ సి.శివరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు చర్యలు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు వచ్చే నెల 9న జరుగనున్న గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులు ప్రదక్షిణ నిర్వహించే ప్రాంతాలను సుందరీకరణ చేసే పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు 15వ వార్డు ఎంఎంటీసీ కాలనీలోని ప్రధాన రహదారికి విరిగిన మధ్య డివైడర్‌ను కార్మికులు శుక్రవారం పునరుద్ధరించారు. అలాగే ఈ మార్గంలో వెలగని విద్యుత్ దీపాలను జీవీఎంసీ విద్యుత్ దీపాల లైన్‌మెన్ శ్రీను పర్యవేక్షణలో పునరుద్ధరించారు. గిరి ప్రదక్షికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ ఆయా విభాగాధికారులు తగు చర్యలను చేపడుతున్నారు.



ఎంఎంటీసీ కాలనీ వద్ద చేపడుతున్న డివైడర్ పునరుద్ధరణ పనులు

కోర్టు తీర్పు అమలుకు యత్నం

కలెక్టరేట్‌కు చేరుకొన్న మాజీ జీపీ తరపు న్యాయవాది

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేసిన తాళ్లూరి రవికుమార్‌కు వేతనం, ఇతర ఖర్చులు ప్రభుత్వం చెల్లించనందునే కోర్టులో కేసు దాఖలు చేశామని అతని తరపు న్యాయవాది కేవీ జగదీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రవికుమార్‌కు వేతనం, ఇతర ఖర్చుల కింద రూ.75 లక్షలు చెల్లించనందున విశాఖ కలెక్టర్ కుర్చీ, కార్యాలయంలో ఫర్నీచర్ అటాచ్ చేస్తూ నాలుగు రోజుల క్రితం ఏడో అదనపు న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు కాపీ, అటాచ్‌మెంట్ ఆర్డర్ పట్టుకుని కోర్టు అమీన్ దేవీశ్రీప్రసాద్, తాళ్లూరి రవికుమార్‌తో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి తొలుత పాలనాధికారి ఈశ్వరరావును కలిసి విషయం నివేదించామన్నారు. అయితే మంత్రితో సమీక్షలో కలెక్టర్ ఉన్నందున వేచి ఉండాలని ఏవో తెలిపారన్నారు. ఈ సమయంలో తాము కిందకు రాగా కోర్టు ఆదేశాల అమలుకు కలెక్టరేట్ అధికారులు తమకు సహకరించలేదని ఆరోపించారు. సమావేశంలో ఉన్న కలెక్టర్‌ను కలిసి అటాచ్‌మెంట్ నోటీస్ ఇచ్చేందుకు తాము యత్నిస్తే మహారాణిపేట స్టేషన్ సీఐ భాస్కరరావు అడ్డుకున్నారని ఆరోపించారు. కలెక్టరేట్ అధికారులు తమకు సహకరించలేదని పేర్కొంటూ మరోసారి అటాచ్‌మెంట్ వారెంట్ తీసుకుని ఆస్తులు జప్తునకు వస్తామని జగదీశ్వరరెడ్డి స్పష్టంచేశారు.



కలెక్టర్ చాంబర్ వద్ద మాజీ జీపీ రవికుమార్, అతని తరపు న్యాయవాదులు

జీవీఎంసీ స్థాయీ సంఘంలో

పలు అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్మన్, మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో 8 మంది స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 286 ప్రధాన అజెండా అంశాలతో పాటు 13 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 299 అంశాలను పొందుపరచగా, వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 239 అంశాలు ఆమోదం పొందాయని, మిగిలిన 60 అంశాలను వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి గుత్తలు, ఆశీలు, ఉద్యోగుల పరిపాలనా పరమైన అంశాలు, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి, పనుల అంశాలకు సంబంధించి ఆమోదం పొందిన వాటిలో ఉన్నాయని, వాటిని చర్చించిన పిదప సభ్యులు పలు అంశాలను ఆమోదం తెలిపారని తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఇప్పినాయుడు, కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, బి.రాము, బీఆర్ఎస్ శేషాద్రి, హేమావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్లోబల్ వేదికపై మెరిసిన విశాఖపట్నం

- బ్లూమ్‌బెర్గ్ మేయర్స్ ఛాలెంజ్-2025 ఫైనలిస్టు జాబితాలో చోటు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరం.. బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక మేయర్స్ చాలెంజ్-2025లో ప్రపంచ వ్యాప్తంగా ఎంపికైన 50 నగరాల్లో ఒకటిగా నిలిచినట్టు విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నగరాల వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఈ 6వ ఎడిషన్ నిర్వహించారు. మొత్తం 99 దేశాలకు చెందిన 630 నగరాలు ఈ పోటీలో పాల్గొనగా, వాటిలో 33 దేశాలకు చెందిన 50 నగరాలు మాత్రమే ఫైనలిస్టులుగా ఎంపికయ్యాయి. వీటి జనాభా 8 కోట్ల మందికి పైగా విశాఖపట్నం నగరానికి కమ్యూనిటీ ఆధారిత వాతావరణ భద్రతను బలోపేతం చేసే వినూత్న ఆలోచనకు సీడ్ ఫండింగ్‌గా 50 వేల డాలర్లు, అలాగే నిపుణుల సహాయం లభించనుందని వారు తెలిపారు. వచ్చే నెలలో జీవీఎంసీ నిపుణుల బృందం బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ నిర్వహించే ఐడియాస్ క్యాంపులో పాల్గొంటుందని, చివరి దశలోని 25 నగరాలకు ఒక్కొక్కటికి 1 మిలియన్ డాలర్లు గల అవార్డులు 2026, జనవ లో ప్రకటిస్తారని జీవీఎంసీ కమిషనర్ తెలిపారు.

మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గుర్తింపు విశాఖ నగరాన్ని వాతావరణ భద్రత కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశగా మరింత బలపరుస్తుందని, ప్రజాముఖి-అర్బన్ లివింగ్ ల్యాబ్ ద్వారా తాము ప్రజల భాగస్వామ్యంతో ప్రాణాలు, జీవనోపాధులను రక్షించే పరిష్కారాలను సమష్టిగా సృష్టించుకుంటున్నామన్నారు. ఇది కేవలం సాంకేతికపై ఆధారపడినది కాదని, ఇది విశ్వాసం, సహకారం, స్థానిక స్ఫూర్తిపై ఆధారపడినదన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ గురించి..

బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ 150 దేశాల్లోని 700 నగరాలలో పెట్టుబడులు పెట్టి ఎక్కువమంది ప్రజల కోసం మెరుగైన, దీర్ఘకాలిక జీవనాన్ని అందించేందుకు కృషి చేస్తోంది. ఈ సంస్థ కళలు, విద్య, పర్యావరణం, ప్రభుత్వ వినూత్నత, ప్రజారోగ్యం అనే ఐదు ముఖ్య రంగాలలో శాశ్వత మార్పు కోసం కృషి చేస్తుంటుంది.

ఖాతాదారుల ఆదరణలో కనకమహాలక్ష్మి బ్యాంకు ముందడుగు


- బ్యాంకు అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు

సీతమ్మధార, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 26వ మహాజన సభ శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. మద్దిలపాలెం సమీపంలోని ఎంఆర్‌సీ కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో బ్యాంకు అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరణతో రూ.1,020 కోట్ల డిపాజిట్లు, రూ.680 కోట్ల రుణాలు, రూ.11.20 కోట్లు నికర లాభంతో తమ బ్యాంకు ముందడుగు వేస్తోందన్నారు. మెరుగైన బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే కాకుండా పేదలకు ఉచిత వైద్యం, విద్య తదితర సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములమవుతున్నట్లు చైర్మన్ చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన నలుగురేసి సభ్యుల పిల్లలకు ప్రశాంసా పత్రాలు, రూ.5 వేలు ప్రోత్సాహక నగదు ఎంపిణీ చేశారు. షేరు ధనంపై 14 శాతం డివిడెండ్ ప్రకటించడంతో సభ్యులు హర్షధ్వానాలు చేశారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, మాజీ చైర్మన్ పి.రఘునాథరావు, ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, పాలకవర్గ సభ్యులు ఎం.రాఘవేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సి.పి.రామారావు, ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయుడు, డాక్టర్ వై.రమేష్, సిహెచ్.శ్రీనాథ వెంకటేశ్వరరావు, రేవు రత్న కుమారి, పి.హరీష్, డాక్టర్ జి.రామకృష్ణప్రసాద్, కేసీఎస్.గురుప్రసాద్, కె.సదాశివరావు, బి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవి దున్న ఈనింది



ఆరిలోవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో అడవి దున్న ఒక దూగకు జన్మ ఇచ్చినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇది బాస్ గారస్ జాతికి చెందిన దున్న అని తెలిపారు. అడవి దున్న, దూడ సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆమె చెప్పారు.

అంగరంగ వైభవంగా జగన్నాథ రథోత్సవం



రథయాత్రలో రథం లాగుతున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఇతర ప్రముఖులు



ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో చీపురుతో రహదారిని శుభ్రం చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తదితరులు

డాబాగార్డెన్స్/మహారాణిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఇస్కాన్ శాఖ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభు ఆధ్వర్యంలో మంగళధ్వని, కోలాటం, భజనలు, సంకీర్తనలు, హరేకృష్ణ స్మరణ నడుమ జగన్నాథ రథయాత్ర శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. పుష్పాలతో అలకరించిన రథంపై భక్తుల కోలాహలం మధ్య సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వాములు ఆసీనులయ్యారు. సాంబదాస్ మాతాజీ, నితాయ్ సేవిని రథం ముందు కొబ్బరికాయ కొట్టి, ప్రాంగణాన్ని ఊడ్చి రథయాత్రను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు హాజరయ్యారు. జీవీఎంసీ సిటీ సెంట్రల్ పార్కు నుంచి ప్రారంభమైన రథయాత్ర డాబాగార్డెన్స్, జగదాంబసెంటర్, రామ్‌నగర్ మెయిన్‌రోడ్డు మీదుగా సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు సాగి అక్కడ ముగిసింది. భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. గురజాడ కళాక్షేత్రం వేదికపై వేదమంత్రాలతో అర్చకులు అర్చనలు నిర్వహించగా, సాంబదాసు ప్రభుజీ జగన్నాథుని లీలలను వివరిస్తూ ఆధ్యాత్మిక ఉపన్యాసమిచ్చారు. 1008 రకాల ప్రసాదాలు నివేదించి మంగళహారతులిచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఆధ్యాత్మికవేత్తలు ఎం.వి.రాజశేఖర్, వంశీప్రభు, జ్యోతి, ఇస్కాన్ జీవితకాల సభ్యులు, మహిళా సేవకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా పరిషత్ జంక్షన్‌లోని కృష్ణ మందిరం వద్ద కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో కన్నుల పండువగా యాత్ర నిర్వహించారు. బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి రధయాత్రను ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, కోలాటం సందడి నడుమ భక్తులు జై జగన్నాథ్ అంటూ స్మరిస్తూ రథాన్ని లాగారు. గోకుల్ పార్కు, బీచ్, కోస్టల్ బ్యాటరీ, కలెక్టరేట్ జంక్షన్ మీదుగా జిల్లా పరిషత్ జంక్షన్‌లోని కృష్ణ మందిరం వద్దకు తీసుకు వచ్చారు. రధాన్ని అక్కడ ఉంచి ముగ్గురు మూర్తులకుప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉమ్మడి జిల్లాలో తహశీల్దార్ల కొరత

(5వ పేజీ తరువాయి)

ఇద్దరిని విశాఖ జిల్లాకు, ముగ్గురిని అనకాపల్లి జిల్లాకు, అనకాపల్లి జిల్లా నుంచి ఒకరిని అల్లూరి జిల్లాకు, విశాఖ నుంచి ఇద్దరిని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. అయితే అనుకూలమైనచోట పోస్టులు రాలేదని విశాఖ జిల్లాలో ఇద్దరు తహశీల్దార్లు సీసీఎల్‌కు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అల్లూరి జిల్లా నుంచి ఇద్దరు తహశీల్దార్లు ఇంకా విశాఖ జిల్లాకు రాలేదు. ప్రస్తుతం విశాఖ జిల్లాలో గాజువాక, పెందుర్తి, ఆనందపురం, సీతమ్మధార, ములగాడ మండలాలకు తహశీల్దార్లను నియమించాల్సి ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏకంగా ఎనిమిది మంది తహశీల్దార్లు కొరత ఏర్పడడంతో పాలన ముందుకుసాగడం లేదనే వాదన ఉంది. చింతపల్లి, జి.మాడుగుల, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, పెదబయలు, హుకుంపేట మండలాలకు పూర్తిస్థాయి తహశీల్దార్లు లేరు. అల్లూరి జిల్లా కలెక్టరేట్‌లో ఒక సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జులు ఉన్న మండలాల్లో అనేక ఇబ్బందులు వస్తున్నాయి. కనీసం విద్యార్థులకు ధ్రువపత్రాలు కూడా సకాలంలో జారీకావడం లేదనే విమర్శలు ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా నుంచి అనకాపల్లికి బదిలీ అయిన ఇద్దరూ అక్కడ చేరలేదు. దీనికితోడు మరో ఖాళీ ఉంది. దీంతో అనకాపల్లి జిల్లాలో మూడు ఖాళీలు ఉన్నట్టుగా గుర్తించారు. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లలో కొద్దిమందికి డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. అప్పుడు తహశీల్దార్ పోస్టులు మరికొన్ని ఖాళీ అవుతాయి. ఈలోగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండలాల్లో సీనియర్ డీటీలకు అడహక్ పదోన్నతులు ఇస్తే పాలన సజావుగా సాగుతుంది. ఇందుకు మూడు జిల్లాల కలెక్టర్లు సమావేశమై నిర్ణయం తీసుకోవల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల జాప్యం జరుగుతోందంటున్నారు.

నీటి సరఫరా బంద్

(5వ పేజీ తరువాయి)

వ్యక్తంచేస్తుంది. ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా కేవలం కౌన్సిల్ తీర్మానంతో వేతనాలు పెంచడానికి అవకాశం లేదని ఆ ఫైల్‌ను ఆపేసింది. దాంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మే నెలకు సంబంధించి పాత జీతాలే వచ్చాయి. దాంతో వారు సమ్మెకు దిగుతామని ఈ నెల మొదటి వారంలో ప్రకటించారు.

నగరంలో యోగాంధ్ర కార్యక్రమం ఉన్నందున 15 రోజులు సమయం కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు వారిని కోరారు. అయితే తాజాగా జూన్ నెలకు సంబంధించిన వేతనాలు కూడా పాత విధానంలో ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలియడంతో జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్, లేబర్ యూనియన్ శుక్రవారం నుంచి సమ్మె చేయనున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ విషయం తెలిసినా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గానీ వారితో సంప్రతింపులు జరపలేదు. దాంతో కార్మికులు చెప్పినట్టుగానే శుక్రవారం సమ్మెకు దిగడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందిపడ్డారు. నగరంలో పెద్ద పెద్ద అపార్టుమెంట్లన్నీ జీవీఎంసీ నీటిపైనే ఆధారపడుతున్నాయి. వాటిలో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. చాలా అపార్టుమెంట్లలో ట్యాంకులు ఖాళీ అయిపోయాయి. బయట నుంచి తెప్పించుకుందామన్నా అక్కడ కూడా సిబ్బంది సమ్మెలో ఉన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్ నగరంలో లేరు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలు ఇతర ప్రాంతాల పర్యటనలో ఉన్నారు. మిగిలిన ప్రజా ప్రతినిధులు నగరానికి ఇద్దరు మంత్రులు రావడంతో వారితో కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు కార్మిక సంఘాలతో చర్చలు జరపగా, వారు పెంచిన జీతాలు ఈ నెల నుంచి ఇస్తేనే పనిచేస్తామని, అంతవరకు సమ్మెలోనే ఉంటామని చెప్పి బయటకు వచ్చేశారు. దాంతో శనివారం కూడా నీటి సరఫరా నిలిచిపోయే పరిస్థితి ఎదురైంది. చాలామంది ప్రజా ప్రతినిధులకు నగరంలో నీటి సరఫరా లేదని, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారనే విషయం కూడా తెలియకపోవడం గమనార్హం.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు... ఫలితం అంతంత మాత్రం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ మాట వింటారని ఉన్నతాధికారులు ధీమాగా ఉండి శుక్రవారం సాయంత్రం వరకూ ఏమీ పట్టించుకోలేదు. వారు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిపెట్టారు. ఉద్యోగులు ఎవరూ సెలవులు తీసుకోవద్దని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం అంతా అప్రమత్తంగా ఉండి, వార్డు సచివాలయాల ఎమినిటీస్ (సౌకర్యాలు) కార్యదర్శితో నీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆదేశాలు ఇచ్చారు. 98 వార్డులను సందర్శిస్తూ నీరు అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పగించారు.

నీటి సరఫరా వీజీ కాదు

నగరానికి నీటి సరఫరా చేయడం అంటే అంత తేలికైన విషయం కాదు. రైవాడ, తాటిపూడి రిజర్వాయర్ల వద్ద నీటి పంపింగ్‌ను పర్యవేక్షించే సిబ్బంది ఉండాలి. ఏలేరు కాలువ నుంచి గ్రావిటీ ద్వారా వచ్చే నీటిని నిర్వహించే వారు ఉండాలి. అక్కడి నుంచి వచ్చిన నీటిని నగరంలో గల రెండు వేలకు పైగా ట్యాంకులకు ఎక్కించాలి. ఆ నీటిని మళ్లీ బూస్టర్ పంపింగ్ స్టేషన్ల ద్వారా సరఫరా చేయాలి. ప్రతి వార్డుకు టర్న్ కాక్‌లు వెళ్లి నీటి సరఫరా వాల్వ్‌లు విప్పితేనే ఆ ప్రాంతానికి నీరు అందుతుంది.

ఈ క్రమంలో వాల్వ్ చెకర్లు, వాటర్ క్వాలిటీ తనిఖీ చేసేవారు ఇంకా అనేక మంది పనిచేయాల్సి ఉంటుంది. పై నుంచి నీరు రాకుండా వార్డు సచివాలయాల సిబ్బంది ఏమీ చేయలేరు. అత్యంత అవసరమైన తాగునీటి సరఫరాలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజలతో పాటు పరిశ్రమల నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమ్మెను విరమింపజేసి శనివారం యథాప్రకారం నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అప్పన్న ఆలయ పర్యవేక్షణాధికారి సస్పెన్షన్

సింహాచలం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులును సస్పెండ్ చేస్తూ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు ఉత్తర్వులిచ్చారు. ప్రధానాలయాల్లో మౌలిక వసతులపై ఐవీఆర్ఎస్ (ఇంటర్నెట్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా భక్తుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. వసతులు, దర్శనాలు, ప్రసాదాల నాణ్యత వంటి వాటిపై నిత్యం వెయ్యి మంది నుంచి అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది. ఈ క్రమంలో త్రిమూర్తులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు గుర్తించారన్నారు.

కాంగ్రెస్ చీకటి అధ్యాయానికి 50 ఏళ్లు: ఎంపీ తేజస్వి సూర్య



సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం అధ్యక్షుడు తేజస్వి సూర్య

అక్కయ్యపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన చీకటి అధ్యాయానికి (అత్యాయిక పరిస్థితి) 50 ఏళ్లు పూర్తయ్యాయని భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జాతీయ అధ్యక్షుడు, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య అన్నారు. పోర్టు కళావాణి స్టేడియంలో శుక్రవారం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1975 జూన్ 25న అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎమర్జన్సీ ప్రవేశపెట్టడంతో దేశ ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చరిత్రను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసి, ప్రజల స్వేచ్ఛను హరించి చాలామందిని జైలుకు పంపారని చెప్పారు. దీన్ని ఆర్ఎస్ఎస్, జనసంఘ్ పూర్తిగా వ్యతిరేకించాయన్నారు. అనంతరం ఎమర్జన్సీలో ఇబ్బందులు ఎదుర్కొన్న వారి అనుభవాలను పంచుకుని వారిని సత్కరించారు. ఈ సమాశంలో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు మిట్టవంశీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, రవీంద్రరెడ్డి, రవీంద్ర ప్రకాశ్, ఎం.సురేశ్, జ్యోతి పాల్గొన్నారు. తేజస్వి సూర్యకు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనస్వాగతం పలికారు. విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ నిర్వహించిన ర్యాలీలో తేజస్వి సూర్య పాల్గొన్నారు. కైలాసపురంలో 46వ వార్డు యువమోర్చా నాయకుడు కొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు.

‘వైసీపీ భూ దోపిడీ’

సీతంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రూ.వేల కోట్ల భూ దోపిడీ జరిగిందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌరగ్రంథాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినా కొందరు అధికారుల తీరు మారలేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని కొందరు చూస్తున్నారన్నారు. కొందరు ఐఏఎస్, రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా నిరభ్యంతర పత్రాలు ఇస్తున్నారన్నారు. వీటిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. భూ దోపిడీపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు.

కలెక్టర్‌కు మంత్రి అభినందన



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పార్థసారథి

మహారాణిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర వేడుకలను విజయవంతంగా నిర్వహించిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన మంత్రి శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మంత్రి దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యంత్రాంగం యోగాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు కూడా కలెక్టర్‌ను అభినందించారు.

విద్యార్థులకు మేలుచేస్తాం: డీఈవో



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను సమీపంలో గల ఆర్పీపేట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేసే విషయమై తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు రావడంతో డీఈవో వారితో మాట్లాడారు. కమిటీ తీర్మానం అనంతరం అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం విలీనం చేశామన్నారు. తల్లిదండ్రుల నుంచి అందుతున్న వినతుల దృష్ట్యా సమస్యను జిల్లా కలెక్టరు ద్వారా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులకు మేలు జరిగేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అంబటి సోమేశ్వరావు, ఎంఈవో డి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పాలీసెట్ కౌన్సెలింగ్



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలె, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 21 నుంచి జరుగుతున్న పాలీసెట్ కౌన్సెలింగ్ శనివారం ముగియనుంది. చివరి రోజు కెమికల్ కళాశాల్లో 1,20,001 ర్యాంకు నుంచి 1,27,000 ర్యాంకు వరకు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో 1,27,001 ర్యాంకు నుంచి ఆఖరి ర్యాంకు వరకు గల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. శుక్రవారం రెండు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో 388 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. యాభై వేలు నుంచి తొంభై వేల ర్యాంకుల మధ్య పలువురు తమ వెబ్ ఆప్షన్లను హెల్ప్ లైన్ కేంద్రాలకు హాజరై నమోదు చేసుకున్నట్టు అధికారులు తెలియజేశారు.

నాణ్యమైన వస్తువులు విక్రయించండి

సీతమ్మధార, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ డి.డి. రవికిరణ్ శుక్రవారం సందర్శించి స్టాల్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాటాడారు. డ్వాక్రా గ్రూపుల స్టాల్స్‌లో ఉల్లిపాయలు, టమాటాలను పరిశీలించి నాణ్యమైనవి విక్రయించాలని సూచించారు. ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి నుంచి బజార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జనసేన పార్టీలో చేరిక

సీతంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 34వ వార్డుకి చెందిన స్క్రాప్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జహంగీర్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీలో చేరిన వారికి కండువా వేసి స్వాగతించారు. 39వ వార్డు కార్పొరేటర్ షాదిక్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

జూ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

అలాంటి వాతావరణమే తీసుకురావాలని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సింగపూర్ జూను నిర్వహిస్తున్న మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులను ఇటీవల విశాఖపట్నం రప్పించి జూ మొత్తం చూపించారు. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి వారితో మాస్టర్ ప్లాన్ తయారుచేయించారు. పర్యాటకులకు మరిన్ని వసతులు, సదుపాయాలు, వారిని ఆకర్షించే అంశాలు అందులో ఉండేలా సూచనలు చేశారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి కేంద్రానికి సమర్పిస్తారు. ఆమోదం లభిస్తే నిధులు వస్తాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా అభివృద్ధి చేస్తారు.

రూ.75 కోట్లతో మొదటి దశ పనులు

సింగపూర్ బృందం తయారుచేసిన మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం లభిస్తే కేంద్రం నుంచి రూ.75 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు నిధులు వస్తాయి. వాటితో మొదటి దశ పనులు చేపట్టి రాబోయే పదేళ్లలో సందర్శకుల సంఖ్యను కోటి వరకు పెంచాలని యోచిస్తున్నాము. గతంలో సందర్శకులకు టాయ్ ట్రైన్ ఉండేది. నిర్వహణ లేక మూలపడింది. దానిని పునరుద్ధరించడంతో పాటు ఇంకా అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

అందుబాటులోకి ఆర్థిక శాఖ భవనం

(5వ పేజీ తరువాయి)

అక్కడే కొనసాగుతుందన్నారు. ఖజానా కార్యాలయం దశాబ్దాలుగా కలెక్టరేట్‌లోని గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో కొనసాగింది. అయితే ఫస్ట్ ఫ్లోర్ పైకప్పు పూర్తిగా శిథిలం కావడంతో పలుమార్లు మరమ్మతులు చేశారు. వర్షాకాలం వస్తే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించేవారు. రెండేళ్ల క్రితం ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. మిగిలిన భాగం ఎప్పుడు కూలిపోతుందోనన్న ఆందోళన వ్యక్తమైంది. గత నెల గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చే మెట్లు కూలిపోయి అటెండర్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కలెక్టర్ స్పందించి వెంటనే కొత్త భవనంలోకి మార్చాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పూర్తి కావడంతో ఖజానా కార్యాలయాన్ని తరలించారు.

భవనంలోకి ఆర్థిక శాఖ అనుబంధ విభాగాలు

ఆర్థిక శాఖ పరిధిలో అనుబంధ విభాగాల కోసం జల వనరుల శాఖ ఈఈ కార్యాలయ ఆవరణలో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి గతం (2014-19)లో టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏపీ ప్రభుత్వ బీమా సంస్థ, సబ్ ట్రెజరీ, ఫస్ట్ ఫ్లోర్‌లో జిల్లా ట్రెజరీ, మిగిలిన అంతస్థులలో ఆడిట్ విభాగం, పే అండ్ అకౌంట్స్, ఇతర అనుబంధ విభాగాల ఏర్పాటుకు అనుగుణంగా భవనం డిజైన్ చేశారు.

ఏపీ విద్యా మౌలిక వసతుల ఇంజనీరింగ్ సంస్థ సుమారు రూ.25.1 కోట్లతో పనులు చేపట్టింది. 2019 నాటికి మెజారిటీ నిర్మాణ పనులు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తి, ఫర్నీచర్, ఏసీలు, విద్యుత్ సౌకర్యం కల్పించడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. వైసీపీ హయాంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాంట్రాక్టర్‌కు కొంతమేర బిల్లులు, విద్యుత్ సౌకర్యం కోసం ఈపీడీసీఎల్‌కు రుసుం చెల్లించింది.

జాతీయ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో పతకాల పంట



పతక సాధకులతో కోచ్‌లు, ఆంధ్ర పవర్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర లిఫ్టర్లు పతకాల పంట పండించారు. కర్ణాటకలో జరిగిన ఈ టోర్నీలో మహిళల జూనియర్ కేటగిరీ 57 కిలోల విభాగంలో ఎస్.కె.సదియా అల్మాస్, 63 కిలోల విభాగంలో ఎం.తిరుపతమ్మ స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా, 47 కిలోల విభాగంలో ఎం.షనూస్, 69 కిలోల విభాగంలో ఎస్.లక్ష్మి, 84 కిలోల విభాగంలో ఎస్.కె.షబీనా కాంస్య పతకాలు దక్కించుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎ.మాధురి కాంస్య పతకం సాధించింది. పురుషుల జూనియర్ 83 కిలోల విభాగంలో పి.వంశీకృష్ణ, 93 కిలోల విభాగంలో ఎస్.కె.ఖాజావల్లి స్వర్ణ పతకాలు, 74 కిలోల విభాగంలో ఎన్.శరత్ కాంస్య పతకం దక్కించుకున్నారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు, సౌత్‌జోన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు అభినందించారు.

అర్హులందరికీ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. తాగునీటి కోసం ప్రభుత్వం నుంచి కూడా నిధులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం పనులు మొదలైన వాటిని 100 శాతం పూర్తిచేయాలని, గ్రౌండ్ కానీ వాటిని ప్రారంభించవద్దన్నారు. గతంలో అనర్హులకు ఇచ్చినట్టయితే వారిని తొలగించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణంలో ప్రగతి చూపని కాంట్రాక్టర్లను ఉపేక్షించేది లేదన్నారు. హౌసింగ్ అధికారులు రోజువారీ లక్ష్యాలు విధించుకుని, ఈ ఏడాది చివరి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హండ్‌హండ్ ఇళ్లు అప్పటి జాబితా ప్రకారమే లబ్ధిదారులకు అందించాలన్నారు. ముదపాక లేఅవుట్‌పై కోర్టు కేసును జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు రైతులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ లేఅవుట్లలో తాగునీటి కోసం జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తీసుకుని మొదటి దశలో రూ.20 కోట్లు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుంచి కొన్ని నిధులు మంజూరు చేయించా లన్నారు. గడిచిన మూడు నెలలుగా జిల్లాలో ఇళ్ల నిర్మాణం వేగవంతమైందన్నారు. 2026 మార్చిలోగా నూరుశాతం పూర్తిచేస్తామని కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, హౌసింగ్ సీఈ రామ్మోహన్‌రావు, పీడీ సత్తిబాబు, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత లేదు

సబ్బవరం: పైడివాడఅగ్రహారంలో గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం ఎన్టీఆర్ గృహ నిర్మాణ లే-అవుట్‌ను, నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. మెటీరియల్, నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్వాకంతో ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించిందన్నారు. లేఅవుట్ల అభివృద్ధి, ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవకతవకపై విచారణ చేయిస్తామన్నారు. ఇక్కడి లేఅవుట్లలో మిగిలి ప్లాట్లను స్థానిక లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

రేషన్ పరేషాన్

(5వ పేజీ తరువాయి)

డిపో పరిధిలో ప్రస్తుతం వృద్ధులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ ఇచ్చిన జాబితాలో పేర్కొన్న కార్డుదారుల్లో ఇద్దరు నుంచి ఐదుగురికి మాత్రమే డీలర్లు ఈ రెండు రోజుల్లో బియ్యం ఇవ్వగలిగారు. గత ప్రభుత్వంలో డీలర్లకు, కార్డుదారులకు మధ్య ఎటువంటి సంబంధాలు లేవు. ఎండీయూల ద్వారా బియ్యం పంపిణీ చేయడంతో కార్డుదారుల్లో ఎవరెక్కడ ఉన్నారో డీలర్లకు ఇప్పుడు తెలియడం లేదు. వచ్చే ఐదారు రోజుల్లో వృద్ధులందరికీ రేషన్ పంపిణీ చేయలేమని అంటున్నారు. గాజువాక పరిధిలో ఒక డీలరు రెండు రోజుల్లో కేవలం నలుగురికే బియ్యం ఇచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బందికి తమ పరిధిలో వృద్ధులు, దివ్యాంగుల నివాసాలు తెలుసునని, వారి సాయం తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయాలని డీలర్లు కోరుతున్నారు.

‘ఖాతాదారుల ఆదరణతో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ముందడుగు’



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు

సీతమ్మధార, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 26వ మహాజన సభ శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. మద్దిలపాలెం సమీపంలోని ఎంఆర్‌సీ కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో బ్యాంకు అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖాతాదారుల ఆదరణతో రూ.1,020 కోట్ల డిపాజిట్లు, రూ.680 కోట్ల రుణాలు, రూ.11.20 కోట్లు నికర లాభంతో తమ బ్యాంకు ముందడుగు వేస్తోందన్నారు. మెరుగైన బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే కాకుండా పేదలకు ఉచిత వైద్యం, విద్య తదితర సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములమవుతున్నట్లు చైర్మన్ చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన నలుగురేసి సభ్యుల పిల్లలకు ప్రశంసా పత్రాలు, రూ.5 వేలు ప్రోత్సాహక నగదు ఎంపిణీ చేశారు. షేరు ధనంపై 14 శాతం డివిడెండ్ ప్రకటించడంతో సభ్యులు హర్షధ్వానాలు చేశారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.రామకృష్ణ, మాజీ చైర్మన్ పి.రఘునాథరావు, ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, పాలకవర్గ సభ్యులు ఎం.రాఘవేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సి.పి.రామారావు, ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయుడు, డాక్టర్ వై.రమేష్, సిహెచ్.శ్రీనాథ వెంకటేశ్వరరావు, రేవు రత్నకుమారి, పి.హరీష్, డాక్టర్ జి.రామకృష్ణప్రసాద్, కేసీఎస్.గురుప్రసాద్, కె.సదాశివరావు, బి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన స్కూల్ ఆటో

» విద్యార్థులకు స్వల్పగాయాలు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. టౌన్‌షిప్‌లోని ప్రైవేట్ స్కూల్ విద్యారులు శుక్రవారం ఉదయం ఆటోలో కూర్మన్నపాలెం వైపు వస్తుండగా జనరల్ ఆస్పత్రి జంక్షన్ వద్ద ఆగి ఉన్న కారును ఆటో వెనుకనుంచి ఢీకొంది. గాయపడిన విద్యార్థులకు ఉక్కు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సేవలతోనే ప్రశాంతత

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సేవలతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ అన్నారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొక్కిరాపల్లి వృద్ధాశ్రమానికి నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.

సంస్థ ప్రగతికి కృషి చేయాలి



విభాగాధిపతిని అభినందిస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సంస్థ ప్రగతి కోసం ప్రతి ఉద్యోగీ శక్తివంచన లేకుండా కృషిచేయాలని పీఈఎం విభాగాధిపతి టికె.రాయ్ అన్నారు. అధికారులు, ఉద్యోగులతో ఆయన శుక్రవారం సమావేశమై అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎల్అండ్‌హెచ్, పీఈఎం విభాగం విలీనమయ్యాయని, సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. ప్లాంట్ బీఎఫ్ విభాగం పునఃప్రారంభం కావడంతో అధిక ఉత్పత్తి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో డీజీఎం కమల్, ఉద్యోగులు ఎస్.మోహన్‌బాబు, వై.శ్రీనివాసరావు ఆనంద్, సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రాజు, అప్పారావు పాల్గొన్నారు.

డ్రైడేపై అవగాహన



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్

గోపాలపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ పిలుపునిచ్చారు. చంద్రనగర్‌లో మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. మలేరియా, డెంగ్యూలను అరికట్టేందుకు దోమల నివారణేమార్గమని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. నీటి తొట్టెలను వారంలో ఒక రోజు ఖాళీ చేస్తే దోమల వ్యాప్తి నియంత్రి వచ్చన్నారు. ఈ సందర్భంగా డ్రైడే లాభాలను సానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ).
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 34, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 38, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 94, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180



అగనంపూడిలో జగన్నాథస్వామి రథయాత్రలో పాల్గొన్న భక్తులు



గవరపాలెం కాలనీలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా జగన్నాథ రథయాత్ర

అగనంపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటెత్తారు. తొలుత ఆలయంలో జగన్నాథస్వామి,సుభద్ర, బలభద్రలకు ఒడిశా సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాల మధ్య రథంపైన ఆశీనులను చేశారు. 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. రథయాత్ర అగనంపూడి కూడలి మీదుగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వరకు జరిగింది. ఇంద్రజ్యుమ్ని మందిరంలో స్వామివారిని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు,

పెందుర్తిరూరల్: చింతలఅగ్రహారం గవరపాలెం కాలనీలోని శ్రీగీతా కృష్ణదేవాలయంలో సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామివారి రథం ఆలయం నుంచి బయలుదేరి బస్టాండ్, వీరాజనేయస్వామి ఆలయం మీదుగా చింతలఅగ్రహారం చేరుకుంది. అక్కడ పూజా కార్యక్రమాల తరువాత రామాలయం నుంచి గీతా మందిరానికి భక్తులకు స్వామివారు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అగనంపూడిలో రథంపై కొలువుదీరిన స్వామి

యారాడ బీచ్‌లో అనధికార వసూళ్లను అడ్డుకోండి



మేయర్ పీలాకు వినతపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

పెదగంట్యాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యారాడ సాగరతీరంలో పర్యాటకుల నుంచి, ఈవెంట్స్ చేసుకుంటున్నవారి నుంచి కొందరు ఆశీలు, పార్కింగ్ ఫీజు పేరిట అక్రమంగా వసూలు చేస్తున్నారని వాటికి అడ్డకట్ట వేయాలని కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు మేయర్ పీలా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ఇలా వసూలు చేయలేదన్నారు. దీంతో బీచ్‌లో అక్రమవసూళ్లను వెంటనే నిలిపివేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్‌తో పాటు బీచ్‌లో పర్యటిస్తామన్నారు. కార్పొరేటర్లు పీతల మూర్తి, మొల్లి ముత్యాలు ఉన్నారు.

భెల్ అధికారులకు సత్కారం



భెల్ జీఎం నిరాకర్ ముండాను సత్కరిస్తున్న సంఘం నాయకులు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి లక్ష్యాలను సాధించి కర్మాగార అభివృద్ధికి కార్మికులు, అధికారులు ఐక్యంగా కృషిచేయాలని భెల్ హెచ్‌పీవీపీలో జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన నిరాకర్ ముండా అన్నారు. భెల్‌లో శుక్రవారం జీఎం నిరాకర్ ముండా, సీనియర్ డీజీఎం ఎ.మధుసూదన్, డీజీఎం జి.చంద్రశేఖర్‌లను ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో శుభాకర్ సాహు, కొల్లి దేముడు, జి.కిరణ్, హెచ్.బోగస్, పల్లం శ్రీను, రాజ్‌కుమార్, అపురూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ వేదికపై మెరిసిన విశాఖ నగరం

» బ్లూమ్‌బెర్గ్ మేయర్స్ చాలెంజ్-ఫైనలిస్టు జాబితాలో చోటు

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరం బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక మేయర్స్ చాలెంజ్-2025 ఫైనలిస్టు జాబితాలో నిలిచిందని మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఈ 6వ ఎడిషన్ నిర్వహించారు. మొత్తం 99 దేశాలకు చెందిన 630 నగరాలు పాల్గొనగా, 33 దేశాలకు చెందిన 50 నగరాలు ఫైనలిస్టులుగా ఎంపికయ్యాయి. కమ్యూనిటీ ఆధారిత వాతావరణ భద్రతను బలోపేతం చేసే వినూత్న ఆలోచనకు సీడ్ ఫండింగ్‌గా నగరానికి 50 వేల డాలర్లు, నిపుణుల సహాయం లభించనుందన్నారు. వచ్చే నెలలో జీవీఎంసీ నిపుణుల బృందం బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ నిర్వహించే ఐడియాస్ క్యాంపులో పాల్గొంటుందని, చివరి దశలోని 25 నగరాలకు మిలియన్ డాలర్ల అవార్డులు ప్రకటిస్తారని తెలిపారు. మేయర్ పీలా మాట్లాడుతూ ప్రజాముఖి-అర్బన్ లివింగ్ ల్యాబ్ ద్వారా ప్రజా భాగస్వామ్యంతో ప్రాణాలు, జీవనోపాధులను రక్షించే పరిష్కారాలను సమష్టిగా సృష్టించుకుంటున్నామన్నారు. బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రోపీస్ 150 దేశాల్లోని 700 నగరాల్లో పెట్టుబడులు పెట్టి ప్రజల కోసం మెరుగైన, దీర్ఘకాలిక జీవనాన్ని అందించేందుకు కృషిచేస్తోంది. కళలు, విద్య, పర్యావరణం, ప్రభుత్వ వినూత్నత, ప్రజారోగ్యం రంగాలలో శాశ్వత మార్పునకు కృషి చేస్తోంది.

బురదతో నిండిపోయిన పెదగంట్యాడ రైతుబజార్



కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారిన పెదగంట్యాడ రైతుబజార్

పెదగంట్యాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చినుకు రాలితే పెదగంట్యాడ రైతుబజారు బురదమయమై వారం రోజుల పాటు తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి. వినియోగదారులు బురదలోనే కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇక్కడ 34 స్టాల్స్‌తో రైతుబజారు ఏర్పాటు చేశారు. నిర్వాసిత కాలనీ వాసులకు అందుబాటులో ఉంటుంది. రైతుబజారు లోపల ప్రహరీని ఆనుకుని స్టాల్స్ ఉన్నాయి. వాటి మధ్య విశాలమైన ఖాళీ స్థలం ఉంది. స్టాల్స్‌కు వచ్చిన అదనపు సరకును నిల్వ ఉంచుకునేందుకు, వినియోగదారులు స్టాల్స్‌కు రాకపోకలు సాగించేందుకు ఈ స్థలాన్ని వినియోగించుకుంటున్నారు. ఇది బురదగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తాము తెచ్చిన పంటలన్నింటినీ స్టాల్స్‌లోనే ఉంచుకోవాల్సి వస్తోంది. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని రైతు బజారును సీసీ కాంక్రీట్ వేసి వర్షం నీరు నిల్వలేకుండా చేయాలని రైతులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

కోర్టు తీర్పు అమలుకు యత్నం

» కలెక్టరేట్‌కు చేరుకున్న మాజీ జీపీ తరపు న్యాయవాది

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేసిన తాళ్లూరి రవికుమార్‌కు వేతనం, ఇతర ఖర్చులు ప్రభుత్వం చెల్లించనందునే కోర్టులో కేసు దాఖలు చేశామని అతని తరపు న్యాయవాది కేవీ జగదీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రవికుమార్‌కు వేతనం, ఇతర ఖర్చుల కింద రూ.75 లక్షలు చెల్లించనందున విశాఖ కలెక్టర్ కుర్చీ, కార్యాలయంలో ఫర్నీచర్ అటాచ్ చేస్తూ నాలుగు రోజుల క్రితం ఏడో అదనపు న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు కాపీ, అటాచ్‌మెంట్ ఆర్డర్ పట్టుకుని కోర్టు అమీన్ దేవీశ్రీప్రసాద్, తాళ్లూరి రవికుమార్‌తో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి తొలుత పాలనాధికారి ఈశ్వరరావును కలిసి విషయం నివేదించామన్నారు. అయితే మంత్రితో సమీక్షలో కలెక్టర్ ఉన్నందున వేచి ఉండాలని ఏవో తెలిపారన్నారు. ఈ సమయంలో తాము కిందకు రాగా కోర్టు ఆదేశాల అమలుకు కలెక్టరేట్ అధికారులు తమకు సహకరించలేదని ఆరోపించారు. సమావేశంలో ఉన్న కలెక్టర్‌ను కలిసి అటాచ్‌మెంట్ నోటీస్ ఇచ్చేందుకు తాము యత్నిస్తే మహారాణిపేట స్టేషన్ సీఐ భాస్కరరావు అడ్డుకున్నారని ఆరోపించారు. కలెక్టరేట్ అధికారులు తమకు సహకరించలేదని పేర్కొంటూ మరోసారి అటాచ్‌మెంట్ వారెంట్ తీసుకుని ఆస్తులు జప్తునకు వస్తామని జగదీశ్వరరెడ్డి స్పష్టంచేశారు.



కలెక్టరేట్ వద్ద మాజీ జీపీ రవికుమార్, న్యాయవాది

'పల్లా విగ్రహానికి స్థలం కేటాయించాలి'

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కాంస్య విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మిఅప్పలరాజు డిమాండ్ చేశారు. ఎన్ఏడీ కూడలిలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో యాదవుల సంక్షేమానికి కృషి చేసిన నాయకుడన్నారు. ఆర్కే బీచ్ లేదా గాజువాకలో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే సొంతనిధులతో విగ్రహం ఏర్పాటు చేస్తానన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కిలాడి అప్పలరాజు, వేదుల ప్రసాద్, రోమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సౌకర్యం కేంద్రంలో అవకవతవకలపై విచారణ

వేపగుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వేపగుంట సౌకర్యం కేంద్రంలో అవకవతవకలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఉద్యోగి బ్యాంకు చెల్లింపులు చేయకపోవడంపై రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది, ఆడిట్ విభాగం అధికారులతో కలిపి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఆడిట్ విభాగంలో శనివారం సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా లోటుపాట్లపై చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మెతో నిలిచిన నీటి సరఫరా

గాజువాక, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోరుతూ వాటర్ వర్క్స్ విభాగం కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. గాజువాక నీటి సరఫరా కేంద్రం వద్ద పలువురు మాట్లాడుతూ పెరిగిన జీతాలు, ఎరియర్స్ చెల్లించాలని, పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, అన్‌స్కిల్డ్ వారికి రూ.21వేలు, స్కిల్డ్ కార్మికులకు రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేశారు.

అగనంపూడిలో...

అగనంపూడి: ఔట్ సోర్సింగ్ కార్మికులు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఆందోళన చేపట్టారు. పెరిగిన జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేయాలన్నారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: నీటి సరఫరా అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెతో 68, 69 వార్డుల్లో మంచినీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పారిశ్రామిక ప్రాంతంలో...

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం ఏడు వార్డుల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు పలు ప్రాంతాలకు ట్యాంకులతో నీటిని సరఫరా చేశారు.

గోపాలపట్నం పరిధిలో...

గోపాలపట్నం: నరవలోని గోదావరి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రైవాడ వాటర్ ట్రీట్‌మెంట్ పాంట్ల పరిధిలో సుమారు 80 మంది కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. యూనియన్ కార్యదర్శి ఆర్.సత్యం మాట్లాడుతూ పెంచిన వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్మికులు సమ్మె నోటీసులు ఇవ్వడంతో గురువారం అర్ధరాత్రి ఏఈ పవన్‌కుమార్ గోదావరి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. సిబ్బంది సమ్మెలో ఉండడంతో అధికారులు వెనుదిరిగారు.

కూర్మన్నపాలెంలో...

కూర్మన్నపాలెం: సిద్ధార్థనగర్ పంప్ హౌస్, సుందరయ్య కాలనీ పంప్‌హౌస్ వద్ద శుక్రవారం కార్మికులు ఆందోళన చేశారు. నేతలు సాగి సునీల్ వర్మ, దుగ్గపు దానప్పలు, పి.గోవింద్ ఆధ్వర్యంలో కార్మికులు విధులు బహిష్కరించారు. వేతనాలు పెంచాకే విధుల్లోకి వస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు. భాస్కర్, కృష్ణ శ్రీను, అప్పలరాజు, రాఘవ, రామకృష్ణ, సూరిబాబు కార్మికులు పాల్గొన్నారు.

వేపగుంట జోనల్ పరిధిలో...

వేపగుంట/ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 89 నుంచి 98 వార్డుల్లో అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో నీటి సరఫరా నిలిచిపోయింది. కొండవాలు ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేపగుంట జంక్షన్ పంప్‌హౌస్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఏపీఎస్ఈబీకాలనీ స్టోరేజి వద్ద కూడా పలువురు ఆందోళనకు దిగారు.



అగనంపూడి ప్లాంట్ వద్ద కార్మికుల ఆందోళన



గాజువాకలో నిరసన తెలుపుతున్న కార్మికులు



నరవ గోదావరి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ధర్నా

239 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, మాట్లాడుతున్న మేయర్ పీలా

వెంకోజీపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్మన్, మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో 8 మంది స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 286 ప్రధాన అజెండా అంశాలతో పాటు 13 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 299 అంశాలను పొందుపరచగా, వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప 239 అంశాలు ఆమోదం పొందాయని, మిగిలిన 60 అంశాలను వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం, రెవెన్యూ విభాగానికి సంబంధించి గుత్తలు, ఆశీలు, ఉద్యోగుల పరిపాలనా పరమైన అంశాలు, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి, పనుల అంశాలకు సంబంధించి ఆమోదం పొందిన వాటిలో ఉన్నాయని, వాటిని చర్చించిన పిదప సభ్యులు పలు అంశాలను ఆమోదం తెలిపారని తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఇప్పినాయుడు, కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, బి.రాము, బీఆర్ఎస్ శేషాద్రి, హేమావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'క్షేత్ర స్థాయి నుంచి టీడీపీని బలోపేతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

పెదగంట్యాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని జీవీఎంసీ 75 వవార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు అన్నారు. కార్యకర్తల సమావేశం శుక్రవారం సీతానగరంలో జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోనికి తీసుకెళ్లాలని కోరారు. కమిటీ ప్రధానకార్యదర్శి ములకలపల్లి పెంటయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషిచేందుకు కార్యకర్తలు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో గోక్యాడ ముత్యాలు, మొల్లి రమణబాబు, వురుకూటి అప్పారావు, గొందేశి అప్పలరెడ్డి, మొల్లి శ్రీను, కణితి సన్యాసమ్మ, మొల్లి రమణ, సరోజిని, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టండి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకటనాగేశ్వరరావు

పెదగంట్యాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని వినియోగదారుల హక్కుల రక్షణసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంటకోట వెంకట నాగేశ్వరరావు తహశీల్దార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని కొందరు వ్యాపారులు అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువగా రవాణా అవుతున్నట్టు జిల్లా పౌరసరఫరా అధికారులు గుర్తించారని, వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సంఘం సభ్యులు శ్రీనివాస్, కళ్లా రవి పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనం చెల్లించాల్సిందే



మహాసభలో పాల్గొన్న కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు, సభ్యులు

మల్కాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు డిమాండ్ చేశారు. మల్కాపురం సిటూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. ఏళ్లుగా ప్రైవేటు కార్మికులుగానే పనిచేస్తున్నారని సమయానికి వేతనాలు ఇవ్వడం లేదని, పర్మినెంట్ చేయలనే ఆలోచన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల కాలంలో మృతిచెందిన కార్మికులకు నివాళులర్పించారు మహాసభకు కె.రమణ, ఎస్.ఉమా, రాంబాబు అధ్యక్షత వహించగా మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, నేతలు పి.పైడిరాజు, బి.రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.లక్ష్మణమూర్తి, అధ్యక్షుడిగా కె.రమణ, ఉపాధ్యక్షులుగా డి.రాము, బి.సూరిబాబు, డి.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా శ్యాము, సహాయ కార్యదర్శిగా ఎన్.దేవి, ఎన్.ఉమ, సీహెచ్ లక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.కుమార్, బి.శ్రీను, కోశాధికారిగా రాంబాబుతో సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



సీపీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై అక్కిరెడ్డిపాలెం నుంచి నాతయ్యపాలెం, బీహెచ్‌పీవీ ప్రాంతాలకు వెళ్లే క్రాసింగ్ వద్ద ప్రమాదాలను అరికట్టాలని సీపీ శంఖబ్రత బాగ్చికి 68వవార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష విన్నవించారు. శుక్రవారం ఆయనకు వినతి పత్రం అందజేవారు. క్రాసింగ్ వద్ద కానిస్టేబుల్‌ను నియమించాలని కోరారు. వార్డు మద్యం బెల్ట్ దుకాణాలను గంజాయి విక్రయాలను అరికట్టాలని కోరారు.

సోలార్ పవర్‌తో అందరికీ ప్రయోజనం

» ప్రతి నియోజకవర్గంలో పదివేలు ఏర్పాటు చేయడమే లక్ష్యం

» ఈసీబీసీ భవన ప్రారంభోత్సవంలో ఎంపీ శ్రీభరత్


కారుణ్య నియామక ధ్రువపత్రం అందిస్తున్న మంత్రి గొట్టిపాటి, చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌తో అనేక ప్రయోజనాలున్నాయని, విద్యుత్ బిల్లు తగ్గిపోతుందని, ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని ఎంపీ శ్రీభరత్ సూచించారు. ఈపీడీసీఎల్ సాగర్‌నగర్‌లో రూ.14 కోట్లతో నిర్మించిన ఎలక్ట్రిసిటీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) శిక్షణ భవనాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులతో కలిసి శుక్రవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పీఎం సూర్య ఘర్ పథకం కింద 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు పెట్టాల్సి ఉందని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి పదివేలు చొప్పున లక్ష్యం ఉందన్నారు. ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలన్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ విద్యుత్ పంపిణీ నష్టాలున్న ఈపీడీసీఎల్‌కు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలివ్వాలని కోరారు. భీమిలి నియోజకవర్గంలో ఉద్యోగుల శిక్షణ కోసం ఇంత మంచి భవనం నిర్మించడం గర్వకారణమన్నారు. ఐటీ, పర్యాటకం, హౌసింగ్, పరిశ్రమల పరంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో నాణ్యమైన విద్యుత్ అందించడానికి పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉందన్నారు. ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చాక 34 సబ్‌స్టేషన్లను మంజూరు చేసిందని, వాటిలో 18 ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ సమావేశంలోనే ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకపు పత్రాలను మంత్రి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాశ్‌రావు, చంద్రం, వనజ, విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుని రథయాత్ర

మహారాణిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథచక్రాలు కదిలాయి. విశాఖలోని టౌన్ కొత్తరోడ్డులో 193 సంవత్సరాల చరిత్ర గల అతిపురాతనమైన జగన్నాథ స్వామి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జగన్నాథ, బలభద్ర, సుభద్రమూర్తులను రథంపైకి తీసుకువచ్చారు. అక్కడ భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు విశాఖ ఎంపీ శ్రీభరత్, దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ముగ్గురుమూర్తులకు పూజలు నిర్వహించి అఖండ హారతి ఇచ్చారు. అనంతరం రథానికి కట్టిన తాడును లాగి జై జగన్నాథ్ అంటూ భక్తుల నినాదాల నడుమ రథయాత్రను ప్రారంభించారు. రథయాత్ర సాగే రహదారి పొడుగునా మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కోలాటం, భక్తుల గోవింద నామస్మరణతో దిక్కులు పిక్కటిల్లాయి. జగన్నాథుని రథంతో పాటు ఎంబర్‌మన్నార్ కోదండ రామస్వామి ఆలయాల రథాలు అనుసరించగా, ఆలయం నుంచి టర్నర్ చౌల్ట్రీ సత్రం వరకు యాత్ర సాగింది. అనంతరం ముగ్గురు మూర్తులను టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో ప్రతిష్ఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం నుంచి జూలై 6 వరకు స్వామి వారు దశావతారాలలో భక్తులకు దర్శనమిస్తారు. శనివారం తొలిరోజు మత్స్యావతారంలో కనిపిస్తారు. ఆలయ ఈవో టి.రాజగోపాల రెడ్డి భక్తులకు ఇబ్బందులు కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. దేవదాయ శాఖ ఉపకమిషనర్ ఎన్ సుజాత, ఇతర అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


కోలాటం ఆడుతున్న చిన్నారులు


రథయాత్రలో అలరించిన చిన్నారుల వేషధారణ


రథోత్సవంలో ఎంపీ శ్రీభరత్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ


ఉత్కళ్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రకు హాజరైన భక్తులు


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


రథోత్సవానికి హాజరైన మేయర్ పీలా శ్రీనివాసరావు

బీఎంఎస్ సమావేశం రేపు

పెదగంట్యాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జిల్లా స్థాయి సమావేశం ఆదివారం షీలానగర్‌లో జరుగనుంది. ఇటీవల జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సులో బీఎంఎస్ చెందిన ఐదుగురు ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సు నిర్ణయాలు, తీర్మానాలు జిల్లాలోని కార్యకర్తలకు వివరించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్రశేఖర్ తెలిపారు. బీఎంఎస్ జాతీయ కార్యదర్శి బి.సురేంద్రన్, ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు పాల్గొంటారన్నారు.

రీ షెడ్యూల్‌తో రైళ్లు ఆలస్యం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వివిధ రైల్వే స్టేషన్ల పరిధిలో పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. దీంతో శుక్రవారం రైళ్లు ఆలస్యంగా నడిచాయి.ఉదయం 10.40కు హౌరాలో బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు దురంతో మధ్యాహ్నం 12.40కు, సాయంత్రం 4 గంటలకు బయలుదేరాల్సిన హౌరా-మైసూరు 6 గంటలకు, విశాఖలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-భవానీపట్న పాసింజర్ (58504) రాత్రి 7 గంటలకు బయలుదేరాయి.

పేదల ఇళ్లకు అదనంగా రూ.3,200 కోట్లు

» గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి


మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తికావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.3,200 కోట్ల అదనపు సాయం అందించిందని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత పాలకులు ఇళ్ల నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం వహించారని, ఇప్పుడా పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలిస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలో రెండు లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాల తీరుతెన్నులు పరిశీలించి అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1.89 లక్షల ఇళ్లను మంజూరుచేయగా, ఇప్పటివరకూ 43 వేలు పూర్తిచేశారన్నారు. మిగిలిన ఇళ్లు వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గతంలో ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు చొప్పున కేటాయించారని, ఇప్పుడు అదనంగా ఎస్సీ/బీసీ వర్గాలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఏజెన్సీలో గిరిజనులకు రూ.లక్ష సాయం ఇస్తున్నామన్నారు. పీఎంఏవై.1లో ఉన్న లోపాలను సరిదిద్దుతామని, మిగులు భూమిని లెక్కించి లేఅవుట్‌లను అభివృద్ధి చేసి రెండు సెంట్ల కంటే ఎక్కువ స్థలం ఇస్తామని చెప్పారు. పనులు మధ్యలో విడిచిపెట్టిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. టిడ్కో ఇళ్ల సమస్యలపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.

బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవదానం


పరశురామ్ (ఫైల్)

అరిలోవ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడంతో వివిధ సమస్యలతో బాధపడుతున్న ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. వివరాలివి... భీమిలికి చెందిన పరశురామ్ (22) పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడిపోయాడు. వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం విమ్స్‌లో చేర్చారు. విమ్స్ వైద్యులు ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. దీంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు ప్రకటించి జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారి అనుమతి మేరకు శుక్రవారం పరశురామ్ రెండు కిడ్నీలు, లివర్, కళ్లను స్వీకరించి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న పరశురామ్ తల్లిదండ్రులు ధనరాజు, లక్ష్మిలను అభినందించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.10వేలను అందజేశారు.

ఆడారి ఆనంద్‌ను కలిసిన కేంద్ర మంత్రి

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆయన స్వగృహంలో కలిశారు. విశాఖ డెయిరీ, పాడి రైతుల గురించి కొద్దిసేపు చర్చించారు. మంత్రితో పాటు బీజేపీ నేతలు శివాజీ రాజా బహదూర్, మేడిపాటి రవీంద్ర, మహేష్ పాల్గొన్నారు.


మంత్రి శ్రీనివాసవర్మను సత్కరిస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

బాధ్యతలు స్వీకరించిన శాప్ డైరెక్టర్ రవికుమార్



ఏపీ శాప్ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ఘనంగా జరిగింది. విశాఖకు చెందిన రవి కుమార్ శాప్ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భం గా ఆయన పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

ఎంవీపీ కాలనీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అర్హతగల ఎస్సీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ పెదగంట్యాడలోని నాక్ శిక్షణా కేంద్రంలో ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో శిక్షణ ఇస్తామన్నారు. ప్రధాన మంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకంలో భాగంగా షెడ్యూల్డ్ కులానికి చెందిన యువత ఇంటర్ చదివి, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గలవారు అర్హులన్నారు. మధ్యాహ్న భోజనం, వసతి, స్టేషనరీ ఉచితంగా అందిస్తారన్నారు. శిక్షణానంతరం ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత రంగంలో ఉపాధి కల్పిస్తామని, వివరాలకు 7981022453, 9063269849 నంబర్లలో సంప్రతించాలన్నారు.

ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న బీఎస్సీ హానర్స్, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రవేశాల సంచాలకులు డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 40 మందికి ప్రవేశాలు కల్పిస్తామని, ఏడాదికి రూ.65 వేలు ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 28 నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను జూలై 11లోగా అందించాలన్నారు. జూలై 14న కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు ఏయూ ప్రవేశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో నిర్వహించే ఈ కోర్సుకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు.